PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 286 | విజయవాడ, శుక్రవారం 19 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 19 May 2023 | Rs

నిరసనల మధ్య హిరోషిమా చేరుకున్న బైడెన్

- జపాన్ ప్రధాని కిషిదాతో భేటీ

● లోపలి పేజీలో.. ●



కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి నేడు

పీడిత ప్రజల ప్రియతమ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ప్రకాశ్ కరత్ రాసిన ప్రత్యేక వ్యాసం నాల్గవ పేజీలో...



గవర్నర్ టిసి గెహ్లాట్‌ను కలిసిన సిద్ధరామయ్య, డికె శివకుమార్

సిఎంగా సిద్ధు

డిప్యూటీగా డికె

- రేపు మధ్యాహ్నం ప్రమాణస్వీకారం
- సిఎల్‌పి నేతగా సిద్ధరామయ్య లాంఛనంగా ఎన్నిక
- ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నరును కలిసిన నేతలు

న్యూఢిల్లీ/బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి పదవిపై గత కొన్ని రోజులుగా సాగుతున్న ఎడతెగని అనిశ్చితికి ఎట్టకేలకు తెరపడింది. సిఎం పీఠం సిద్ధరామయ్యకే దక్కింది. ముఖ్యమంత్రి పదవి కోసం చివరి క్షణం దాకా యత్నించిన కర్ణాటక పిసిసి అధ్యక్షుడు డికె శివకుమార్‌కు డిప్యూటీ సిఎం పదవి లభించింది. అధికార పంపకానికి సంబంధించి తీవ్ర తర్జనభర్జనల అనంతరం ఢిల్లీలో పార్టీ అధిష్టానం సమక్షంలో గురువారం ఉదయం ఈ మేరకు రాజీ కుదిరింది. వెంటనే ఆ ఇరువరు నేతలు బెంగళూరు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటలకు బెంగళూరులో సిఎల్‌పి సమావేశమై సిద్ధ రామయ్యను తమ నేతగా లాంఛనంగా ఎన్నుకుంది. దీంతో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోమారు కర్ణాటక ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టేందుకు లైన్ క్లియరైంది. ఆ వెంటనే సిద్ధరామయ్య, డికె శివకుమార్ ఇతర కాంగ్రెస్ నేతలతో కూడిన ప్రతినిధి బృందం రాజ్ భవన్‌కు వెళ్లి గవర్నరు టి సి గెహ్లాట్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాల్సిందిగా కోరింది. దీనికి గవర్నరు సమ్మతించడంతో శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియం వేదికగా జరిగే ఈ ప్రమాణస్వీకారోత్సవానికి పలు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను, భావసారూప్యత గల పార్టీల నాయకులను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించింది. ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డికె శివకుమార్ ఇద్దరూ పట్టుపట్టడంతో తల పట్టుకున్న కాంగ్రెస్ అధినాయకత్వం చివరికి రాజీ కుదరడంతో ఊపిరి మిగతా 7లో

కిరణ్ రిజిజు తొలగింపు

- న్యాయ శాఖ నుంచి తొలగించి భూ విజ్ఞానశాస్త్ర శాఖ బాధ్యత
- అర్జున్ రామ్ మేఘ్వాల్‌కు న్యాయశాఖ


న్యూఢిల్లీ : కేంద్ర మంత్రివర్గంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర మంత్రుల్లో ఇద్దరి శాఖలను మార్చుతూ మోడీ సర్కారు నిర్ణయం తీసుకుంది. న్యాయశాఖ మంత్రిగా ఉన్న కిరణ్ రిజిజును ఆ బాధ్యతల నుంచి తొలగించారు. కేంద్ర సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌కు న్యాయ మంత్రిత్వ శాఖ అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇక రిజిజుకు భూ విజ్ఞానశాస్త్ర శాఖ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి గురువారం ఒక ప్రకటన వెలువడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. కేంద్ర మంత్రుల శాఖల్లో మార్పులు చేసినట్టు రాష్ట్రపతి భవన్ ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం అర్జున్ మేఘ్వాల్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రిగా ఉండగా.. ఇకపై వీటితో పాటు న్యాయశాఖకు స్వతంత్ర మంత్రిగా వ్యవహరించనున్నారు. కాగా.. క్యాబినెట్ హోదా లేకుండా న్యాయశాఖ ను స్వతంత్ర మంత్రికి అప్పగించడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. మరోవైపు ప్రస్తుతం భూ విజ్ఞాన శాస్త్ర శాఖ బాధ్యతలను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ చూస్తుండగా.. ఇప్పుడు ఆ శాఖను కిరణ్ రిజిజుకు అప్పగించారు. జితేంద్ర సింగ్ వద్ద ఇప్పటికే శాస్త్ర, సాంకేతికాభివృద్ధి, పీఎంఒ, సిబ్బంది వ్యవహారాలు, పెన్షన్ తదితర శాఖలు ఉన్నాయి. ఈ ఏడాది చివరిలో రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

త్వరగా ఇళ్ల నిర్మాణం

గృహ నిర్మాణశాఖపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇళ్లులేని నిరుపేదలకు సాధ్యమైనంత త్వరగా ఇళ్లు కట్టించి అప్పగించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని గృహ నిర్మాణశాఖ అధికారులను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణశాఖపై ముఖ్యమంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఆర్‌డిఎ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన అనంతరం నిర్మాణ పనులు వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పేదలకు ఎంత త్వరగా ఇళ్లు సమకూరిస్తే వారి జీవితాలు అంత బాగుపడతాయని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పంపిణీ చేయాలని సూచించారు. దీనిపై అధికారులు పలు అంశాలపై సిఎంకు వివరణ ఇచ్చారు. నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గత 45 రోజుల్లో హౌసింగ్ కోసం రూ.1,085 కోట్లు ఖర్చు చేశామని, ఇప్పటి వరకు 3.70 లక్షల ఇళ్లు పూర్తి చేశామని తెలిపారు. 5.01 లక్షల ఇళ్లు రూఫ్ లెవెల్‌కు చేరుకున్నాయని, త్వరలోనే అవి కూడా పూర్తవుతాయని వివరించారు. మరో 45 రోజుల్లో అన్నిటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌దాటి వివిధ దశల్లో 8.64 లక్షలపైనే ఇళ్లు ఉన్నాయని, వీటి పనులనూ వేగంగా ముందుకు తీసుకెళుతున్నామని పేర్కొన్నారు. సిఎం ఆదేశాల మేరకు 'జగనన్నకు చెబుదాం' స్పెషల్ ఆఫీసర్లు కూడా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్నారని అధికారులు తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో వాడే మెటీరియల్ నాణ్యతపైనా ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నామన్నారు. అలాగే 11.03 లక్షల మంది లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రూ.35 వేలు చొప్పున రూ.3,886.76 కోట్లు పావలా వడ్డీకి అందించామని వివరించారు. సిఆర్‌డిఎ ప్రాంతంలో ఇళ్ల పట్టాల పంపిణీకి అన్ని రకాల చర్యలూ తీసుకున్నామని, ల్యాండ్ లెవలింగ్ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మించిన జగనన్న కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణంపైనా మాట్లాడారు. పూర్తిస్థాయి డ్రెయినేజీ వ్యవస్థ నిర్మించాలంటే భారీ ఎత్తున ఖర్చవుతుందని, ప్రత్యామ్నాయంగా మ్యాజిక్ సోక్‌పిట్ల నిర్మాణంపై అధికారులు తమ ప్లానును సిఎంకు వివరించారు. వీటిని తక్కువ ఖర్చుతో నిర్మించడంతోపాటు భూగర్భ జలాలను పెంచుకునేందుకు వీలుంటుందని సిఎంకు అధికారులు తెలిపినట్లు తెలిసింది. జగనన్న కాలనీల్లో లోలెవల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి మెరక చేయించే అంశంపైనా సిఎం అధికారులతో చర్చించారు. అక్కడ చేపట్టే పనుల్లో ఎటువంటి విమర్శలకూ తావుండకూడదని, కచ్చితంగా పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. సగం నిర్మించుకుని వదిలేసిన ఇళ్లను పూర్తిచేసే అంశంపైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, వాటిని పూర్తి చేయించేందుకు లబ్ధిదారులతో చర్చించి పూర్తిస్థాయిలో గృహ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించిన ఇబ్బందులు ఏమిటో కనుక్కుని వాటిని పరిష్కరించాలని, మునిగిపోయే జగనన్న కాలనీల్లో వెంటనే మెరక చేయించాలని సిఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, సిసిఎల్‌ఎ జి సాయిప్రసాద్, ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మి, గృహ నిర్మాణశాఖ స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం జగన్‌మోహన్ రెడ్డి

లోపలి పేజీల్లో..

ఇవేం ఉత్తర్వులు..?

- వివేకా హత్య కేసులో ఎర్రగంగిరెడ్డికి బెయిల్ రద్దు షరతుపై సుప్రీం ప్రశ్న
- నేడు సిబిఐ ముందుకు అవినాష్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా యుడిఎల్లో మాస్టర్‌ప్లాన్

- ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అప్పుల కోసమే పక్కా ప్లానింగ్
- కేంద్రం ఆదేశాల మేరకు చేయాలని ఒప్పుకోలు

నిధుల కోతతో 'ఉపాధి'కి తూట్లు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



'ఉపాధి' కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం

ప్రజాశక్తి- ఎటపాక, అల్లూరి సీతారామరాజు జిల్లా

'ఉపాధి హామీ'కి నిధులు తగ్గించడం ద్వారా గ్రామీణ పేదల ఉపాధిని కేంద ప్రభుత్వం దెబ్బతీస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా తోటపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'పే స్లిప్పులు ఇవ్వడం లేదని, వారం రోజులు పని చేస్తే నాలుగు రోజుల పనికి మాత్రమే డబ్బులు వస్తున్నాయని, బిల్లుల చెల్లింపు గందరగోళంగా మారిందని, పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయడం లేదని, ఎండ తీవ్రతకు వడ దెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని, తాగునీరు, మజ్జిగ ఏర్పాటుచేయడం లేదని' నాయకుల వద్ద కార్మికులు వాపోయారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. గత బడ్జెట్ కంటే ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులు బాగా తగ్గించారని తెలిపారు. రెండు పూటలా పని విధానంతో కార్మికులను కుదించే ప్రక్రియ చేపట్టారని, సామాన్యులకు రావాల్సిన నిధులకు కోత పెట్టి కార్పొరేట్‌లకు కేంద్రం దోచిపెడుతోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటిత పరుస్తూ ప్రజా ఉద్యమాలను సిపిఎం చేపట్టిందన్నారు. తమకు రావాల్సిన నిధుల కోసం, సౌకర్యాల కోసం ఉపాధి హామీ కార్మికులు పోరాటం చేయాలని, సిపిఎం అండగా ఉంటుందని చెప్పారు.

లోపలి పేజీల్లో..

పోలవరం పునరావాసంపై జూన్ 20 నుంచి మహా పాదయాత్ర : వి.శ్రీనివాసరావు



వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల భారం వద్దు

- అదానీ ఆర్డర్లను రద్దు చేయాలి
- సిఎంకు ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల భారం మోపడం సబబు కాదని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. ప్రైవేట్ కంపెనీల నుంచి కొనుగోలు చేసి వినియోగదారుల ఇళ్లల్లో బలవంతంగా అమర్చే ప్రణాళిక వల్ల ప్రైవేట్ కంపెనీలకు అధికంగా లాభాలు కలుగుతాయని తెలిపారు. ఈ అంశంపై గతంలో తాను లేఖ రాశానని గుర్తుచేశారు. ప్రజల సలహాలను పట్టించుకోకుండా ప్రభుత్వం అదానీ కంపెనీ నుంచి అత్యధిక ధరలకు స్మార్ట్ మీటర్లను కొనుగోలు చేయాలనే నిర్ణయం తీసుకుందని వార్తలు వచ్చాయని తెలిపారు. ఈ నిర్ణయం, వినియోగదారులకు మంచిది కాదని సూచించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం అదానీ కంపెనీ ఇచ్చే మీటర్ ధర రూ.14,266 అని, కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిఎస్‌ఎస్ పథకం కింద సూచించిన మీటర్ ధర రూ.6 వేలు అని తెలిపారు. ఈ రెండింటికి రూ.8,266 తేడా ఉందని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సంస్థల టెండర్‌లో అదానీ కంపెనీ సూచించిన స్మార్ట్ మీటర్ ధర రూ.10 వేలు అని పేర్కొన్నారు. కేంద్రం సూచించిన ధర కంటే అధికంగా ఉందని అక్కడి ప్రభుత్వ సంస్థలు అదానీకి ఆర్డర్ ఇవ్వకుండా తిరస్కరించాయని వివరించారు. అదానీ నుంచి కొనుగోలు చేసే మీటర్లు 5జి టెక్నాలజీకి అనుగుణంగా పనిచేయవని, అయినా పెద్దఎత్తున కొనడం తప్పుడు నిర్ణయమని పేర్కొన్నారు. పాతమీటర్ల స్థానంలో వీటిని అమర్చడం వల్ల ఖర్చు అధికంగా ఉంటుందని, ఖర్చుకు అనుగుణంగా రాష్ట్ర విద్యుత్ సంస్థలకు లాభం కలుగుతుందా అనే మిగతా 2లో

జల్లికట్టుకు సుప్రీం పచ్చజెండా


న్యూఢిల్లీ/చెన్నయ్ : తమిళనాడు ప్రజల సంస్కృతిలో భాగమైన సంప్రదాయ జల్లికట్టు క్రీడ నిర్వహణకు సుప్రీంకోర్టు గురువారం నాడు పచ్చజెండా ఊపింది. ఇందుకోసం తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. జంతు హింస నివారణ చట్టం ఈ క్రీడకు వర్తించబోదని స్పష్టం చేసింది. ఈ మేరకు 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవరిస్తూ ఐదుగురు సభ్యుల ధర్మాసనం తాజా ఉత్తర్వులు వెలువరించింది. తమిళ సంస్కృతిలో జల్లికట్టు భాగమని, ఈ క్రీడల నిర్వహణ కోసం తీసుకొచ్చిన చట్టాన్ని సమర్థించుకుంటూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. సుప్రీంకోర్టు తీర్పును తమిళనాడులోని రాజకీయ పక్షాలన్నీ స్వాగతించాయి. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల సంబరాలు చేసుకున్నారు.

సంక్రాంతి పండుగ సమయంలో తమిళనాడు, సరిహద్దు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో జల్లికట్టును సంప్రదాయంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ క్రీడలో ఎద్దులను తీవ్రస్థాయిలో హింసిస్తున్నారంటూ పెటా వంటి స్వచ్ఛంద సంస్థలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడంతో 2014లో సుప్రీంకోర్టు జల్లికట్టు నిర్వహణపై నిషేధం విధించింది. ఈ క్రీడ జంతువులపై హింస నివారణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని అప్పట్లో న్యాయస్థానం పేర్కొంది. నిషేధాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాట పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ క్రమంలోనే జల్లికట్టును ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ చట్టం నుంచి తొలగిస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం 2017లో తమిళనాడు ప్రభుత్వం జల్లికట్టుకు అనుకూలంగా ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ చట్టానికి సవరణలు మిగతా 7లో

'ద కేరళ స్టోరీ' కల్పితమే

- డిస్‌క్లయిమర్ ప్రదర్శించాలని నిర్మాతలకు సుప్రీం ఆదేశం
- స్వేచ్ఛ పేరిట సమాజంపై విద్వేషాన్ని సహించం
- జస్టిస్ చంద్రచూడ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ : 'ది కేరళ స్టోరీ' చిత్రం పూర్తిగా కల్పిత కథాంశంతో తెరకెక్కించిన సృజనాత్మక సృష్టిగా డిస్‌క్లయిమర్ ప్రదర్శించాల్సిందేనని సుప్రీంకోర్టు ఆ చిత్ర నిర్మాతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేరళలో 32 వేల మంది మహిళలను ఇస్లాం మతంలోకి మార్చారని చెప్పడానికి ఎలాంటి ప్రామాణికత లేదని కూడా సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయాలను సూచిస్తూ డిస్‌క్లయిమర్ ప్రదర్శించాలని చిత్ర నిర్మాతలకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డిస్‌క్లయిమర్ తో చిత్రానికి మార్పులు చేయాలని ఆదేశించింది. కాగా ఈ చిత్ర ప్రదర్శనపై మిగతా 7లో



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

వైద్యుల నిర్లక్ష్యం... గర్భిణి మృతి

- అనాధలైన ఇద్దరు చిన్నారులు
- వైద్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువుల ధర్నా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు (ప్రకాశం)

ప్రసవం కోసం ఆస్పత్రికి వస్తే వైద్యుల నిర్లక్ష్యంతో ఓ నిండు గర్భిణి ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని తిమ్మసముద్రంలో గురువారం చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మసముద్రంలోని దళితకాలనీకి చెందిన తేళ్ళ సంధ్య (25) గర్భిణి. రోజువారి వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం ఉదయం తిమ్మసముద్రంలోని ప్రాథమిక వైద్యశాలకు ఒంటరిగా వెళ్లారు. అక్కడి వైద్యులు సువర్ణరాజ్, ప్రసన్న ఆమెను పరీక్షించి సహజ ప్రసవం అవుతుందని చెప్పి ఆస్పత్రిలో ఉండన్నారు. ఇంటికి వెళ్లి తోడు తెచ్చుకుంటానని చెప్పినా వైద్యులు వినకుండా ఆస్పత్రిలోనే ఉంచారు. విషయం తెలుసుకున్న సంధ్య భర్త, బంధువులు ఆస్పత్రికి వచ్చి వైద్యులను సంప్రదించగా అరగంటలో ప్రసవం అవుతుందని చెబుతూ.. రాత్రి 9 గంటల మిగతా 2లో

రేపు పాలిసెట్ ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిసెట్ ఫలితాలు శనివారం విడుదల చేయనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సిహెచ్ నాగరాణి వెల్లడించారు. ఈ నెల 10న నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 1,43,625 మంది విద్యార్థులు హాజరయ్యారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ ఫలితాలను విడుదల చేస్తారని పేర్కొన్నారు. పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ వివరాలను కూడా వెల్లడిస్తారని తెలిపారు. ఫలితాలు, ర్యాంకుల వివరాలను అభ్యర్థులు polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని వెల్లడించారు.


ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



గల్లంతైన విద్యార్థులు

క్వారీలో ఈతకు వెళ్లి విద్యార్థులు గల్లంతు

ప్రజాశక్తి-పెందుర్తి, విశాఖ

విశాఖ జిల్లా పెందుర్తి మండలం నరవ క్వారీలో ఈతకు దిగిన ఇద్దరు విద్యార్థులు గురువారం గల్లంతయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... పద్మనాభపురం ప్రాంతానికి చెందిన మళ్ల రాజేష్ (17), అనకాపల్లికి చెందిన బండారు నిఖిల్ (17) విశాఖ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్నారు. గురువారం ఉదయం కళాశాలలో జరిగిన పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థులిద్దరూ కళాశాల వెనుక ఉన్న చెరువులో స్థానానికి దిగారు. క్వారీలో పెద్దపెద్ద గోతులు ఉండటంతో ఇద్దరూ గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మునీరయ్యారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాలతో గాలిస్తున్నారు.

గోపురం ఏర్పాటులో అక్రమాలు

- హైకోర్టులో అత్యవసర పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

తిరుపతి శ్రీగోవిందరాజ స్వామి దేవస్థాన విమాన గోపురంపై బంగారు పూతతో కూడిన రాగి రేకులు ఏర్పాటు పేరుతో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది.

అడ్వకేట్ కమిషనరును నియమించి వాస్తవాలపై నివేదిక తెప్పించాలని పిటిషనరు హైకోర్టును కోరారు. ఆలయంలో ఈ నెల 21న జరగనున్న మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారు. తిరుపతికి చెందిన తుమ్మా ఓంకార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇదే తరహాలో గతంలో మరో పిటిషన్ దాఖలైందని, దాంతో ఈ పిటిషన్లు జత చేస్తే శుక్రవారం విచారణ చేస్తామని జస్టిస్ బిఎస్ భానుమతి గురువారం ప్రకటించారు. గత పిటిషన్‌లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదని టిటిడి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ ఎస్ ప్రసాద్ చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా

యుడిఎల్లో మాస్టర్‌ప్లాన్

- ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అప్పుల కోసమే పక్కా ప్లానింగ్
- గతంలో ఉన్న ప్లాన్ల అమలుకే నిధులు లేని వైనం
- కేంద్రం ఆదేశాల మేరకు చేయాలని ఒప్పుకోలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణాభివృద్ధి ప్రాంతాల పరిధిలో పక్కాగా మాస్టర్ ప్లాను రూపకల్పన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం జిఓ నెంబరు 66 విడుదల చేసింది. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి సంస్థలు పెరిగినప్పటికీ వాటిల్లో మాస్టర్‌ప్లాను రూపకల్పన సరిగ్గా చేయలేదని, ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ప్లాను రూపొందించాలని పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఉన్న పరిమితి సాంకేతిక నైపుణ్యంతో ఉందని, ఇక ముందు ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ యాక్ట్ 2016లో సెక్షన్(3) కింద నోటిపై అన్ని ప్రాంతాల్లోనూ తప్పనిసరిగా మాస్టర్‌ప్లాను రూపొందించాలని ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ప్రభుత్వాన్ని కోరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోనే ప్లాన్లు పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఇక ముందు ఆయా పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వచ్చిన అన్ని ప్రాంతాలూ అంటే గ్రామాలకూ ప్లాను అమలు చేయనున్నారు. ఇప్పటి వరకూ పంచాయతీ కార్యదర్శికి నియమిత రుసుము చెల్లించి ఇల్లు నిర్మించుకోవచ్చు. ఇక ముందు పంచాయతీల్లోనూ ప్లానులు అమలు చేయాల్సి ఉంటుంది. నూతన ప్లాను ప్రకారం రోడ్లన్నీ 30 అడుగుల విస్తీర్ణంలో ఉండేలా చూడాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల రోడ్లు తక్కువగా ఉంటే వాటిని 30 అడుగులకు పెంచుకోవడం. అంతకుమించి ఎక్కువగా ఉన్న చోట్ల తగ్గించుకోవడం వంటివన్నీ నూతన ప్లానుప్రకారం రూపొందించనున్నారు. దీనికోసం నియమిత ఫార్మాట్లను ఇచ్చారు. ప్రభుత్వ భూములు, ఆస్తులు, వాటర్‌బాడీలకు వేర్వేరుగా సరిహద్దులు నిర్ణయించాలని అందులో పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో గతంలో ఉన్న రెవెన్యూ సరిహద్దుల ఆధారంగానూ, పెరిగిన గ్రామాల ఆధారంగా వేర్వేరు ప్లానులు రూపొందించాలని సూచించారు. 2015లో కేంద్రం ఇచ్చిన నిబంధనలకు అనుగుణంగా ఈ ప్లాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాస్టర్‌ప్లాను రూపొందించిన తరువాత ప్రభుత్వం అనుమతితో ప్రజల నుండి అభిప్రాయాలు తీసుకోవాలని, అనంతరం ఆమోదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిధుల కోసమేనా..?

ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 19 వరకూ వేర్వేరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు (యుడిఎ) ఉన్నాయి. అమృత్ పథకం వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో పట్టణాభివృద్ధి సంస్థలను పెంచుకుంటూ పోయారు. దీని ప్రకారం మొత్తం 19 ఏర్పాటు చేశారు. వీటిల్లో అనేక యుఎల్‌బిల్లో మాస్టర్‌ప్లాన్లు ఉన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో ఇప్పటి వరకూ అమలు చేయడం లేదు. దీనికి అసవరమైన నిధులూ ఇవ్వడం లేదు. ఇప్పుడు కొత్తగా మరలా మాస్టర్‌ప్లాన్లు రూపొందించాలని ఆదేశించడం వెనుక ఆర్థిక పరమైన కారణాలున్నాయని పట్టణ పౌర సంఘాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు తెలిపారు. వేర్వేరు సంస్థల నుంచి అప్పులు తీసుకోవాలంటే ప్లాన్లు అవసరమని, అందువల్లే ఇప్పుడు ఈ వ్యవహారాన్ని ముందుకు తెచ్చారని తెలిపారు. ఇప్పటికే అన్ని జిల్లాలకూ ఒక అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఉన్నాయి. వాటిల్లో మాస్టర్‌ప్లాను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయి. వాస్తవంగా ఉన్న ప్లాన్లకే నిధులు ఇవ్వడం లేదు. కనీసం రోడ్లు, సదుపాయాలు కూడా కల్పించడం లేదు. మాస్టర్‌ప్లాను ఏర్పాటు చేయడం మంచిదే అయినప్పటికీ ఇప్పుడే మేలుకోవడంపై అనేక కోణాలున్నాయి. మౌలిక సదుపాయాలు, మాస్టర్‌ప్లానులో గుర్తించిన రోడ్ల వెడల్పు, లింకురోడ్ల అభివృద్ధి చేయాలంటే నిధులు ఇవ్వాల్సి ఉన్నా ఆ దృష్టి కనిపించడం లేదు.

ఉన్నదానికే అమలు లేదు కొత్త సూచన

ప్రస్తుతం రాష్ట్రంలో కీలకమైన అమరావతి రాజధాని మాస్టర్‌ప్లానులో ప్రభుత్వం వేర్వేరు కారణాలతో మార్పులు చేర్పులు చేస్తోంది. దానిలో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ప్రజలు వద్దని చెప్పినా ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్లిపోతోంది. ఇప్పుడు కొత్త ప్లానులో మరలా గ్రామసభల అభిప్రాయం తీసుకోవాలని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. మాస్టర్ ప్లాను రూపొందించడం మంచిదే అయినా ప్రభుత్వం నిధులు ఎంత కేటాయిస్తుంది. ఇంతకాలం ఎందుకు ఆగిందనేది ప్రశ్నగా మారింది. నిధులు లేకపోవడంతో ఇప్పటికే ఉన్న యుడిఎల్లో టెండర్లు వేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో కొత్తగా మాస్టర్‌ప్లాను రూపకల్పన చేయాలనే అంశం చర్చనీయాంశం అవుతోంది.

జూన్ 19న కలెక్టరేట్ల ఎదుట చేనేతల ధర్నా

- చేనేత ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ తీర్మానం

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

చేనేతల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని, వారికి అందాల్సిన పథకాలు అందకపోవడం, పూర్తి స్థాయిలో రిజర్వేషన్ అమలు కాకపోవడంతో మరణశయ్యకు దగ్గరవుతున్నారని చేనేత రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. చేనేత సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19న కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. బాపట్ల జిల్లా, చీరాల అంబేద్కర్ భవన్‌లో చేనేత సమస్యలపై రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన చేనేత ప్రతినిధులు రాష్ట్రవ్యాప్త ఉద్యమం నిర్మించాలని ఏకగ్రీవ తీర్మానించారు. బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య జిల్లాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో ఉద్యమ కార్యాచరణ నిర్వహణ కోసం వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో రాష్ట్రస్థాయి చేనేత ఐక్య కార్యాచరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావును రాష్ట్ర కన్వీనర్‌గా, వివిధ చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులను కో-కన్వీనర్లుగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకష్ణ, చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ అధ్యక్షులు అవ్వరు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షులు నీలూరు రుషింగప్ప, ప్రధాన కార్యదర్శి చింతా నాగేశ్వరరావు, ఎం నాగరాజు, ఎఐటియుసి చేనేత కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు, గొట్టేముక్కల బాలాజీ, చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహనరావు, దేవనవీర నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'

- కార్యక్రమం కింద విద్యార్థులకు సన్మానం
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం సన్మానించనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులను సన్మానించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిఇసి/ఎంఇసి కోర్సుల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి వారికి నగదు అందజేస్తామన్నారు. ఈ నెల 23న నియోజకవర్గ స్థాయిలో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని ఇఏపిసెట్ పరీక్ష వల్ల 25వ తేదీకి మారుస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన పదోతరగతి విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు అందిస్తామన్నారు. ఇంటర్ వారికి రూ.15 వేలు చొప్పున నగదుతో సత్కరిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు పొందిన వారికి రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు చొప్పున అందిస్తామన్నారు. ఇంటర్ విద్యార్థులకు రూ.50 వేల నగదు ఇస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 31న విజయవాడలో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం ప్రకటించిన పారితోషికంలో మార్పు లేదన్నారు. జగనన్న ఆణిముత్యాలకు సంబంధించిన ఉత్తర్వులను కూడా పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం విడుదల చేశారు.

సంక్షోభంలోకి విద్యుత్ రంగం

- పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనసభ ప్రజాపద్దుల కమిటీ (పిఎసి) ఛైర్మన్ పయ్యావుల కేశవ్ విమర్శించారు. జూమ్ ద్వారా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనాలోచిత, కక్షసాధింపు నిర్ణయాలతో మూడేళ్లలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై భరించలేని విధంగా విద్యుత్ ఛార్జీల భారం మోపారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల ప్రకారం విద్యుత్ కొనుగోలు చేయకుండా విండ్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిని నీరుగార్చారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం ఒక యూనిట్ విద్యుత్ కొంటే దానికి రెండుసార్లు డబ్బు చెల్లించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్ కొనడం కమీషన్ల కోసం కాదా? అని ప్రశ్నించారు. హిందుజా నుంచి విద్యుత్ కొన్నా కొనకపోయినా ఆ సంస్థకు రూ.6 వేల కోట్ల నుంచి రూ.7 వేలకోట్లు ప్రభుత్వం డబ్బు చెల్లించాల్సిన దుస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. మూడేళ్లలో రూ.12 వేల కోట్ల విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై ఆ భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం మిగులు విద్యుత్‌గా ఉన్న రాష్ట్రాన్ని లోటు రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఈ నాలుగేళ్లలో జరిపిన విద్యుత్ కొనుగోళ్లపై విచారణకు సిద్ధమా? అని నిలదీశారు. అవులపల్లి, ముదివేడు, నేతిగుంటపల్లి రిజర్వాయర్లకు సంబంధించిన పనులు నిలిపివేయాలన్న ఎన్‌జిటి తీర్పుపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏం సమాధానం చెబుతారని టిడిపి నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. ఈ రిజర్వాయర్ల పరిధిలోని నిర్వాసితులకు ఎప్పుడు న్యాయం చేస్తారని విలేకరుల సమావేశంలో నిలదీశారు. జగన్ అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా కాలువల పనులను, గాలేరు నగరి, జిఎన్‌ఎస్‌ఎస్ పనులను గాలికొదిలేశారని విమర్శించారు. నీళ్లు తేలేని ప్రాజెక్టుల్లో అతినీతి చేయడానికే పెద్దిరెడ్డి బంధువులకు చెందిన పిఎల్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు రూ.3 వేల కోట్లతో మూడు ప్రాజెక్టులు అప్పగించారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మూడు రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం వెనకున్న కుట్రకోణాన్ని ముఖ్యమంత్రి బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

సిఎం జగన్‌కు వివేకా హత్యకేసులో అన్నీ తెలిసే బుకాయిస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. వివేకాను హత్య ఎవరు చేశారు? ఎందుకు, ఎలా, ఎప్పుడు అనే వివరాలన్నీ జగన్‌కు ముందే తెలుసని ఆరోపించారు. బాబాయి చనిపోయాడని తెలిసి కూడా మేనిఫెస్టో సమావేశాన్ని ఆ రోజు ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. అజయ్ కల్లం, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సిబిఐ దర్యాప్తుకు సహకరించి వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. నారాసుర రక్త చరిత్ర అని ఒక అభూత కల్పన చేశారని, ఇప్పటికైనా నిజం నిగ్గుతేల్చాలని సిబిఐని కోరారు. రాజధానికి పేదలను దూరం చేసిన వ్యక్తి జగన్ అని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. పేదలకు ఇళ్లపట్టాల పేరుతో కుట్ర రాజకీయాలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల పేరుతో చిత్తుకాగితంతో సమానమైన పట్టాలను పేదలకు ఇస్తున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో తేలిపోయిందన్నారు.

అవినీతికర ప్రభుత్వాన్ని సాగనంపాలి

- బహిరంగ సభలో చంద్రబాబు

ప్రజాశక్తి-యంత్రాంగం

అవినీతి వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ప్రజలను టిడిపి అధినేత చంద్రబాబు కోరారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో రోడ్డుషో నిర్వహించారు. అనంతరం దేవిబొమ్మ కూడలి వద్ద జరిగిన సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, నిత్యావసర సరుకుల ధరలు, ఇంటిపన్ను, రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఒకటేమిటి అన్నింటినీ పెంచేసి పేదలను మరింత పేదలుగా చేశారని అన్నారు. ఇసుక విధానం వల్ల 49 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరక్క అవస్థలు పడుతున్నారని, సామాన్యులు ఇళ్లు నిర్మించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు రూ. 25కోట్లు చొప్పున ఇసుకపై దోచేస్తున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు బిగించిన మీటర్లలోనూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పేదలపై ప్రేమ ఉంటే మూడు సెంట్లు ఇవ్వాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ.40వేల కోట్లు భూ దోపిడీ చేశారని, రూ.45వేల కోట్లు లిక్కరు మాఫియా, రూ.10వేల కోట్లు ఇసుక మాఫియా జరిగిందని ఆరోపించారు. ఇటువంటి దోపిడీ నాయకులను ఇంటికి పంపాలన్నారు. రాష్ట్రాన్ని కాపాడి పేదోడి రాజ్యం తెస్తానని, అందుకు ప్రజలంతా తనకు సహకరించాలని కోరారు. అంతకుముందు విశాఖ జిల్లా పెందుర్తి మండలం వేపగుంట సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్ హాల్లో బీసీలు, మత్స్యకారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఒకప్పుడు వెనుకబడిన వర్గాలను పట్టించుకోని పరిస్థితి ఉండేదని, కేవలం కుల వృత్తుల మీద జీవనోపాధి చేసేవారని తెలిపారు. మత్స్యకారుల పిల్లల కోసం తెలుగుదేశం పార్టీ హయాంలో తొమ్మిది రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఆనాడు ఒక మంచి ఉద్దేశంతో ఫార్మాసిటీ ఏర్పాటుచేస్తే, నేడు అందులో పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోకగజపతి రాజు, విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

రాజయ్య కుటుంబానికి రూ.10 లక్షలు

టిడిపి కార్యకర్త రాజయ్య కుటుంబానికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రూ.10 లక్షలు పరిహారం ప్రకటించారు. ఇటీవల చంద్రబాబు ప్రకాశం జిల్లా సభలో రాళ్లదాడి జరిగిన విషయం తెలిసిందే. వైసిపి గూండాల రాళ్లదాడిలో రాజయ్య గాయపడి మరణించారని చంద్రబాబు పేర్కొన్నారు. రాజయ్య కుటుంబ సభ్యులతో గురువారం ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

వడదెబ్బకు ఐదుగురు మృతి

- ఇద్దరు ఉపాధి కార్మికులు, వృద్ధులు, ఓ యువకుడు

ప్రజాశక్తి - యంత్రాంగం



శేషగిరిరావు (ఫైల్)

రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఉదయం ఏడు గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఇంటిలో నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. వడగాలులు, ఉక్కపోతతో సామాన్యులు, వృద్ధులు అల్లాడుతున్నారు. వడదెబ్బకు గురై రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఐదుగురు మరణించారు. ప్రకాశం జిల్లా దర్శి పట్టణానికి చెందిన చెన్నూరి రమేష్(36) తన పని నిమిత్తం బయటకు వెళ్లారు. అనంతరం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత అస్వస్థతకు గురై మరణించారు. దర్శి మండలంలోని కొర్లమడుగు గ్రామానికి చెందిన సిహెచ్ రామకృష్ణ (33) ఉపాధి పనులకు వెళ్లారు. ఎండ వేడిమి, వడగాల్పులతో పని ముగించుకుని ఇంటికి వచ్చారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురై ఇంట్లోనే కుప్పకూలిపోయి మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జరుగుమల్లి మండలం, కె.బిట్రగుంట గ్రామంలో రెడ్డి పెద కోటమ్మ (83) వేడి గాలులు, ఉక్క పోతకు తట్టుకోలేక వడదెబ్బతో ఇంటి వద్దనే మరణించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని పీరుసాహెబ్‌పేటకు చెందిన ఉపాధి కార్మికులు గురుగుబెల్లి శాంతమ్మ (75)కంచరాపువానిపేట చెరువులో ఉపాధి పనికి వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఎండ వేడిమికి తట్టుకోలేక ఒక్కసారిగా కిందపడిపోయి..అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన వృద్ధుడు తుమ్మలచెర్ల శేషగిరిరావు (73) వడదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబీకులు ఆయనను మచిలీపట్నం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్.రామారావు

కేంద్రం ఆంక్షలతో ఉత్పత్తికి ఆటంకం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

కేంద్ర ప్రభుత్వ ఆంక్షలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ అనేక విభాగాల్లో రా మెటీరియల్ లేక ఉత్పత్తి నిలిచిపోయి నష్టాలు పెరిగిపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడటం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 826వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సిఎంఎం, సిఇడి, సిఆర్‌ఎంపి, లూబ్రికెంట్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, ఎన్.రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ... కాళ్లు, చేతులు కట్టేసి పరుగు పెట్టమన్నట్లు కేంద్రం తీరు ఉందని విమర్శించారు. గత రెండేళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ సమస్యను ప్రధాని వద్ద రాష్ట్ర ప్రభుత్వం బలంగా ప్రశ్నించ లేకపోవడాన్ని తప్పుపట్టారు. ఇతర రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల జోలికొస్తే ఊరుకునేది లేదని, ఆ పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే నడుపుకుంటామని ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులు కేంద్ర ప్రభుత్వానికి సవాలు విసురుతుంటే మన రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు నరేంద్ర మోడీకి వంత పాడుతున్నాయని విమర్శించారు. రాజకీయ పార్టీల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు ఏకమై మోడీకి తెలుగువారి ఆకాంక్షను తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎ భానుమూర్తి, ఎస్.మోహన్‌బాబు, శశిరెడ్డి వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత దారుణహత్య

- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మృతదేహం గుర్తింపు

ప్రజాశక్తి-వెలిగండ్ల (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లాలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. వెలిగండ్ల మండలం జిల్లెలపాడు క్రాస్ రోడ్డు వద్ద మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలపాడు గ్రామానికి చెందిన కోటా రాధ (35)కు తెలంగాణ రాష్ట్రంలోని కోదాడకు చెందిన మోహన్‌రెడ్డితో 2013లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మోహన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ.. కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల నిమిత్తం జిల్లెలపాడులోని తన తల్లిదండ్రుల వద్దకు రాధ వచ్చింది. రాధ గతంలో వెలిగండ్లకు చెందిన వ్యక్తికి వ్యాపారం నిమిత్తం రూ.70 లక్షలు అప్పుగా ఇచ్చింది. అప్పు తీర్చాలని రాధ తరచూ అడుగుతుండడంతో బెంగుళూరులో ఉద్యోగం వచ్చిందని, దశలవారీగా తీరుస్తానని సదరు వ్యక్తి రాధను నమ్మిస్తూ వచ్చాడు. ప్రస్తుతం రూ.2 లక్షలు ఇస్తానని రాధ సెల్‌కు మెసేజ్ చేశాడు. బుధవారం సాయంత్రం కనిగిరి వెళ్తున్నట్లు రాధ తన తల్లిదండ్రులకు చెప్పి.. తన వెంట చిన్నకుమారుడిని తీసుకెళ్ళింది. కనిగిరిలోని వారి బంధువుల వద్ద కుమారుడిని ఉంచి కనిగిరి టౌన్‌కి వెళ్లింది. ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ చేపట్టగా జిల్లెలపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్నట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా రాధ మృతదేహం రోడ్డు పక్కన కనిపించింది. హత్యకు గురైనట్లు నిర్ధారించుకొని.. కేసు నమోదు చేశారు. రుణం తీసుకున్న వాళ్లే చంపేశారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు 'గురుకుల' విద్యా సంస్థల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు పరీక్ష శనివారం జరగనుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్నకుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరంలో 5, 6, 7, 8వ తరగతులకు సంబంధించిన ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కళాశాలల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లను ఖజూతీం.ఖజూఏటం.ఐఅ నుంచి అభ్యర్థులు తమ ఐడి, పుట్టిన తేదీ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. పరీక్ష సమయం కంటే అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఓఎంఆర్ పత్రం నింపేందుకు బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని పరీక్షా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం... గర్భిణి మృతి

మొదటి పేజీ తరువాయి

వరకు కాలం వెల్లబుచ్చారు. సంధ్యకు రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉందని, చీరాల తీసుకెళ్లాలని వైద్యులు చెప్పారు. చీరాల ఆస్పత్రికి వెళ్లగా.. అక్కడి వైద్యులు పరీక్షించి తమ వల్ల కాదంటూ ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. సంధ్య మృతి విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు తిమ్మసముద్రం ప్రాథమిక వైద్యశాల వద్ద మృతదేహంతో ధర్నాకు దిగారు. సంధ్య మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సంధ్యకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. తల్లిని కోల్పోవడంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల భారం వద్దు

మొదటి పేజీ తరువాయి

విషయాన్ని ప్రభుత్వం సరిగ్గా పరిశీలించలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. యుకె ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పథకం అమలు చేసే ముందు లాభ, నష్టాల గురించి అధ్యయనం చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక సంస్థ సహాయంతో చేసిన అధ్యయనంలో స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ సంస్థలకు, వినియోగదారులకు నష్టాలు అధికంగా ఉంటాయని ప్రభుత్వానికి తెలిపిందని పేర్కొన్నారు. ఈ అధ్యయనాన్ని ప్రజల ముందు పెట్టాలని తాను సూచించినా ప్రభుత్వం బయటపెట్టలేదని, ఇది సరైన నిర్ణయం కాదన్నారు. వినియోగదారులను మభ్యపెట్టి ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం సబబుగా లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నట్లు స్మార్ట్ మీటర్ల వల్ల లాభాలు చేకూరితే వినియోగదారుల ఛార్జీలలో తగ్గింపు ఉండాలని తెలిపారు. కానీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో వినియోగదారులపై భారం పెరిగిందని పేర్కొన్నారు. అంటే స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలే అధికంగా ఉంటాయని వివరించారు. వినియోగదారులను మభ్యపెట్టి ప్రభుత్వం త్వరలో అదానీ కంపెనీకి అంతపెద్ద స్మార్ట్‌మీటర్ల ఆర్డర్ ఇవ్వడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. గతంలో అదానీ కంపెనీకి, నిబంధనలకు విరుద్ధంగా లాభాలను కలిగించే నిర్ణయాలను తీసుకుందని పేర్కొన్నారు. టెండర్లు లేకుండా గంగవరం పోర్టులో ప్రభుత్వం వాటాను 11 శాతం అతితక్కువ ధరకు అమ్మడం, కృష్ణపట్నం పోర్టు కంపెనీ అదానీ చేతిలోకి పోవడానికి ప్రభుత్వం దోహదం చేయడం, టెండర్లు పిలవకుండా ఆ కంపెనీకి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ఇవ్వడం, విశాఖలో అతివిలువైన వందల ఎకరాల ప్రభుత్వ భూమిని చౌక ధరకు ఇవ్వడం ఇందుకు ఉదాహరణలు అని వివరించారు. అదానీకి ఇవ్వదలచిన స్మార్ట్ మీటర్ల ఆర్డర్‌ను, వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



గతేడాది వరదలో చిక్కుకుపోయిన దేవీపట్నం (ఫైల్)

పోలవరం పునరావాసంపై జూన్ 20 నుంచి మహాపాదయాత్ర

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి -చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ జూన్ 20 నుంచి మహాపాదయాత్ర చేపట్టనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. తొలుత జూన్ మొదటి వారం నుంచి గ్రామసభలు నిర్వహించి, తీర్మానాలు చేస్తామన్నారు. జూన్ 15లోపు రాష్ట్రప్రభుత్వం పరిహారం అందజేయకపోతే, 20 నుంచి పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. ముంపు విలీన మండలాల పర్యటనలో భాగంగా గురువారం సిపిఎం బృందం చింతూరులో విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసిత బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందే వరకూ దశల వారీ పోరాటాలను చేపడతామన్నారు. ముంపు ప్రాంతాల్లో గత సంవత్సరం వరదలు సంభవించినప్పుడు వరద సహాయక కార్యక్రమాలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా జూన్ 15 నాటికి వరద సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతుందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను తక్షణమే ఆదివాసీలకు చెల్లించాలని, పోడు భూములకు పట్టాలు అందించాలని, ఉపాధి కార్మికులకు పూటకు రూ.350 చెల్లించాలని, 'ఉపాధి' పని ప్రదేశంలో అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బప్పెన కిరణ్, కార్యదర్శివర్గసభ్యులు లోత రామారావు, కుంజా సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇవేం ఉత్తర్వులు..?

- వివేకా హత్య కేసులో ఎర్రగంగిరెడ్డికి బెయిల్ రద్దు షరతుపై సుప్రీం ప్రశ్న
- నేడు సిబిఐ ముందుకు అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో/ అమరావతి బ్యూరో

'బెయిల్ రద్దు తరువాత మళ్లీ బెయిల్ ఇవ్వాలని ఉత్తర్వులు.. ఇవేం ఉత్తర్వులు?' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ప్రశ్నించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ-1 నిందితుడు ఎర్రగంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేస్తూ హైకోర్టు పేర్కొన్న షరతును సవాల్ చేస్తూ సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వెకేషన్ బెంచ్ విచారణ చేపడుతుందని సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఎర్రగంగిరెడ్డి డీఫాల్ట్ బెయిల్ రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, జూన్ 30లోగా దర్యాప్తును పూర్తి చేయాలని సిబిఐని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జులై 1న గంగిరెడ్డిని బెయిల్‌పై విడుదల చేయాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ జెబి పార్ధీవాలాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సమయంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల పట్ల సిజెఐ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బెయిల్ రద్దు చేసి జూన్ 30 తరువాత మళ్లీ బెయిల్ ఇవ్వాలని వెంటనే ఉత్తర్వులు ఇవ్వడంపై సిజెఐ ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఇవేం ఉత్తర్వులంటూ అసహనం వ్యక్తం చేస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. ఎర్ర గంగిరెడ్డి, సిబిఐకు నోటీసులు జారీ చేస్తూ వారం రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. వెకేషన్ బెంచ్ తదుపరి విచారణ చేపడుతుందని సిజెఐ పేర్కొన్నారు.

దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని ప్రశ్నించే అంశంపై మేం స్పష్టం చేస్తాం

దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని ప్రశ్నించడానికి మాజీ ఎంపి వివేకానంద వ్యక్తిగత సహాయకుడికి తగిన అర్హత ఉందా లేదా అనేది స్పష్టం చేస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. తనకు అర్హత ఉందంటూ దేవిరెడ్డి శంకర్‌రెడ్డి ప్రధాన పిటిషన్‌లో వివేకా పిఎ ఎంవి కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఎంవి కృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్‌చౌదరి వాదనలు వినిపిస్తూ, హత్యకేసుకు సంబంధించి పిటిషనర్ ఫిర్యాదుతోనే ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు. తనకు ప్రశ్నించే అర్హత ఉందని దీనిపై స్పష్టత కావాలని కోరారు. అనంతరం స్పష్టత ఇస్తామని ధర్మాసనం తెలిపింది. గతంలో ఇదే అంశంపై దేవిరెడ్డి శంకర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా, నిందితులకు ఈ అంశంపై ప్రశ్నించే హక్కు లేదని, తగిన వ్యక్తి ప్రశ్నిస్తే పరిశీలించగలమని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయం విధితమే.

నేడు సిబిఐ ముందుకు అవినాష్ రెడ్డి

వివేకా హత్య కేసులో కడప ఎంపి అవినాష్‌రెడ్డి శుక్రవారం సిబిఐ ముందు విచారణకు హాజరుకానున్నారు. ఈ నెల 16న విచారణకు రావాలని అవినాష్‌రెడ్డికి సిబిఐ నోటీసు ఇవ్వడంతో ముందస్తు ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలతో షార్ట్ నోటీసుతో విచారణకు రాలేనని నాలుగు రోజులు గడువు కావాలని కోరిన విషయం తెలిసిందే. అయితే సిబిఐ 19న విచారణకు హాజరుకావాలని నోటీసు ఇచ్చింది. శుక్రవారం హైదరాబాద్‌లోని కోఠీలో వున్న సిబిఐ కార్యాలయంలో అవినాష్‌రెడ్డి హాజరు కానున్నారు.

ఇద్దరు యువరైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం, బేతంచర్ల

అప్పుల బాధ తాళలేక ఇద్దరు యువ రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనంతపురం, నంద్యాల జిల్లాలో ఈ రెండు ఘటనలు గురువారం చోటు చేసుకున్నాయి. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని పసులూరు గ్రామానికి చెందిన తలారి శివయ్య (35) సిద్దరాంపురం గ్రామంలో నాలుగు ఎకరాల పొలముంది. రూ.15 లక్షలు అప్పు చేసి దానిమ్మ పంట సాగు చేశారు. దిగుబడి ఉన్న సంవత్సరం ధరలు లేక, ధరలు ఉన్న సమయంలో దిగుబడి లేకపోవడంతో అప్పుల భారం అధికమైంది. వడ్డీల భారం అధికమవ్వడం, అప్పులు తీరే దారిలేకపోవడంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



టి.శివయ్య(ఫైల్)

నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామానికి చెందిన యువరైతు లక్ష్మయ్య (26) తనకున్న ఐదు ఎకరాల పొలంతో పాటు రెండున్నర ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. సాగు నిమిత్తం రూ.పది లక్షలు అప్పు చేశారు. పంట దక్కకపోవడంతో అప్పుల భారం అధికమై తీవ్ర మానసిక వేదనకు గురయ్యేవారు. అప్పులు తీరే దారిలేకపోవడంతో పొలంలోనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాయలసీమలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు

యువగళ పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి / నంద్యాల కలెక్టరేట్

టిడిపి అధికారంలోకి రాగానే రాయలసీమలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, రైతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం నంద్యాలలో సాగింది. రైతు నగరం యాతం ఫంక్షన్ హాల్ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. నంద్యాల శివారు ప్రాంతం నుండి కానాల, చింతకుంట్ల, జూలేపల్లి మీదుగా సాగింది. పాదయాత్ర ప్రారంభానికి ముందు నారా లోకేష్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల పాలిట శనిగా మారారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సీమ ప్రాంతానికి నీరందిస్తే రైతులు బంగారు పండిస్తారని అన్నారు. టిడిపి హయాంలో రాష్ట్రంలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మాలంటే భయపడేవారని, వైసిపి ప్రభుత్వంలో యథేచ్ఛగా నకిలీవి అమ్ముతున్నారని ఆరోపించారు. పాదయాత్ర 1300 కిలో మీటర్లకు చేరడంతో మైలు రాయిని లోకేష్ ఆవిష్కరించారు. ఈ యాత్రలో మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల నియోజకవర్గం ఇన్‌చార్జీ భూమా బ్రహ్మానందరెడ్డి, యువ నాయకులు ఎండి ఫిరోజ్, నాయకులు అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



నంద్యాలలో 1300 కిలోమీటర్ల మైలురాయిని ఆవిష్కరిస్తున్న నారా లోకేష్

లోకేష్ కుడిభుజానికి ఎంఆర్ఐ స్కానింగ్

నంద్యాల మ్యాగ్న ఎంఆర్ఐ సెంటర్‌లో నారాలోకేష్ కుడి భుజానికి ఎంఆర్ఐ స్కానింగ్ చేయించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రవేశించిన సందర్భంలో భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తల తోపులాటలో నారాలోకేష్ కుడి భుజానికి గాయమయ్యింది. అప్పటి నుండి నొప్పితో బాధపడుతూనే పాదయాత్ర కొనసాగిస్తున్నారు. జాగ్రతలు తీసుకున్నా, 50 రోజులు దాటిపోయినా ఇంకా నొప్పి తగ్గకపోవడంతో డాక్టర్ల సూచన మేరకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయించారు.

ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం తగదు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులతో పోల్చి మాట్లాడటం తగదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. టిడిపి హయాంలో సెంటు భూమి కూడా పేదలకు ఇవ్వలేదన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల కలలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కనీసం టిడ్కో ఇళ్లను కూడా సక్రమంగా నిర్మించలేకపోతే జగన్ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. పేదల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబును దేశం నుంచే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన తమ వద్ద లేదని, అయినా పార్టీని బతికించుకునేందుకు ముందస్తు పేరుతో తప్పుడు ప్రచారం చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.

2024లో చంద్రబాబుకు సమాధే : మంత్రి జోగి రమేష్

2024లో జరిగే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు శాశ్వతంగా సమాధి కట్టబోతున్నారని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. రాష్ట్రంలో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఈ యుద్ధంలో పేదలవైపు జగన్‌మోహన్‌రెడ్డి వుంటే, పెత్తందారుల వైపు చంద్రబాబు వున్నారని విమర్శించారు. ప్రజల్లో జగన్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక పిచ్చోడిలా పవన్ కల్యాణ్ ట్విట్టర్‌తో కాలం గడుపుతున్నారన్నారు.

సిబిఐ విచారణను తప్పదోవ పట్టించడం తగదు

- సిఎం ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివేకా హత్య కేసులో సిబిఐ విచారణను తప్పుదారి పట్టించేలా ప్రచారం చేయడం తగదని రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వివేకాది గుండెపోటని సిబిఐకి చెప్పినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. సిబిఐ ఎస్‌పి తనను కలిసిన మాట వాస్తవమేనని, కొంత సమాచారం కోసం కలిశారు తప్ప తనను ఏమీ విచారించలేదని తెలిపారు. వివేకాది గుండెపోటా? హత్యా అనే అంశాలు ప్రస్తావనకు రాలేదని అన్నారు. సిబిఐ విశ్వసనీయత దెబ్బతినేలా జరుగుతున్న ప్రచారాన్ని సిబిఐ కూడా ఖండించాలని కోరారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు.

పొలంలో రైతు సజీవ దహనం

ప్రజాశక్తి-నాదెండ్ల (పల్నాడు జిల్లా)

పొలంలో వ్యర్థాలను దహనం చేసే క్రమంలో అదేమంటలు అంటుకుని రైతు సజీవ దహనమైన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలో గురువారం వెలుగుచూసింది. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు గ్రామానికి చెందిన రైతు బండారుపల్లి వెంకటేశ్వర్లు (72)కు రెండెకరాల పొలం ఉంది. పంటల అనంతరం తన పొలంలో కలుపు పెరగడంతో దాన్ని తొలగించి దుక్కి దున్ని మళ్లీ సాగుకు సిద్ధం చేసుకోవడానికి ఉపక్రమించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం పొలానికి వెళ్లి నిప్పు పెట్టాడు. కొద్దిసేపటికి ఆ మంటలు పెద్దవై పక్క పొలంలోకి వ్యాపించబోయాయి. మంటలను అదుపు చేసేందుకు వెంకటేశ్వర్లు ప్రయత్నించి అదే మంటల్లో చిక్కుకున్నారు. దట్టమైన పొగ వల్ల ఊపిరాడక అక్కడే పడిపోయారు. మంటలు ఆయన్ను చుట్టేయడంతో మృత్యువాత పడ్డారు. పొలానికి ఉదయం వెళ్లిన వ్యక్తి సాయంత్రమైనా రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ మంటల్లో కాలి పడి ఉన్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్)

ఈ ఆఫీస్ నిర్వహణలో వైజాగ్ పోర్టుకు రెండో స్థానం

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అత్యంత ప్రతిభావంతమైన డేటా గవర్నెన్స్ నాణ్యతా సూచిలో వైజాగ్ పోర్టు దేశంలో రెండో స్థానంలో నిలిచిందని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీతి ఆయోగ్ నిర్వహించిన సర్వేలో 5 పాయింట్లకుగానూ వైజాగ్ పోర్టు 4.7 పాయింట్లు సాధించి 66 శాఖల్లో రెండో స్థానంలో నిలిచింది. పాలనా వివరాల నిర్వహణలో మంత్రిత్వ శాఖ నిబద్ధత, సమర్థతను నీతి ఆయోగ్‌లోని అభివృద్ధి పర్యవేక్షణ, మూల్యాంకన కార్యాలయం ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ-ఆఫీస్ నిర్వహణలో కె.అనలిటిక్స్ విభాగంలో ఈ గవర్నెన్స్ సూచీలలో ఏప్రిల్ 2023కు గానూ అన్ని మేజర్ పోర్టులలో విశాఖపట్నం పోర్టు అథారిటీ రెండో స్థానంలో నిలిచింది. ఈ ఘనతను సాధించడంలో సహకరించిన పోర్టు ఆపరేటర్లు, స్టివెడోర్స్‌కు పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు ధన్యవాదాలు తెలిపారు. మేజర్ పోర్టులలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు ప్రణాళికాబద్ధంగా, నిబద్ధతో పని చేస్తే రాబోయే రోజుల్లో పోర్టులు షిప్పింగ్ జలరవాణా శాఖ, విశాఖపట్నం పోర్టు అథారిటీ సైతం మొదటి స్థానంలో నిలపవచ్చని పోర్టు చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

వేర్వేరు ఘటనల్లో 76 మూగ జీవాలు మృతి

- రైలు ఢీకొని 59, పిడుగుపాటుకు 17 మృత్యువాత

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం), శృంగవరపుకోట (విజయనగరం)

రాష్ట్రంలోని వేర్వేరు ఘటనల్లో 76 గొర్రెలు, మేకలు గురువారం మృత్యువాతపడ్డాయి. శ్రీకాకుళంలో రైలు ఢీకొని 59, విజయనగరంలో 17 జీవాలు మృతి చెందాయి. బాధితులు, పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. తాళ్లభద్ర గ్రామానికి చెందిన కిక్కర కామయ్య, ఉదయపురానికి చెందిన బద్రి సింహాద్రి, జయరామ చంద్రాపురానికి చెందిన కిక్కర సోమేశ్వరరావుకు చెందిన 300 గొర్రెలు, మేకలను పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నీలాపురంలో మంద వేసి ఇళ్లకు వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతోపాటు ఆ ప్రాంతానికి సమీపంలో పిడుగు పడింది. దీంతో మందలో ఉన్న మేకలు, గొర్రెలు చెల్లాచెదురయ్యాయి. సోమేశ్వరరావుకు చెందిన 49, బద్రి సింహాద్రికి చెందిన ఐదు, కామయ్యకు చెందిన ఐదు గొర్రెలు, మేకలు తాళ్లభద్ర వద్ద రైల్వే పట్టాలపైకి రావడంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాయి. రైలు పట్టాలకు ఇరువైపులా మృతి చెందిన గొర్రెలు, మేకలను చూసి పెంపకందారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పశు సంవర్ధకశాఖ అధికారులు మృతి చెందిన జీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. తమను ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు.విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం మూల బొడ్డవర పంచాయతీ పరిధిలోని మరిపల్లి గ్రామానికి చెందిన దేవర సత్తిబాబు తన జీవాలకు మేత కోసం సమీపంలోని పొలాల్లో తోలుకెళ్లాడు. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో జీవాలన్ని చింత చెట్టు కిందకు చేరాయి. ఒక్కసారిగా చెట్టుపై పిడుగుపడటంతో 17 మేకలు అక్కడకక్కడే చనిపోయాయి.

సంపాదకీయం


బలవుతున్న బడుగు జీవులు

కూటి కోసం.. కూలి కోసం.. పనులు చేసుకుని బతుకుదామని బయల్దేరిన శ్రమజీవులు మార్గమధ్యంలోనే ప్రమాదాల బారినపడి బలవుతున్నారు. ఇటీవల మన రాష్ట్రంలో జరిగిన భారీ ప్రమాదాలన్నింటిలోనూ ప్రాణాలు కోల్పోయింది బడుగుజీవులే కావడం విషాదం. ఈ వారంలో మన రాష్ట్రంలో మూడు భారీ ప్రమాదాలు జరగ్గా, వాటిలో మరణించిన వారిలో 17 మంది మహిళలే కావడం విషాదం. వీటిలో రెండు ప్రమాదాల్లో మరణించిన వారంతా రెక్కాడితేగాని డొక్కాడని మహిళలు. అందువల్లే సెవెన్ సీటర్ ఆటోలో ఒక ఘటనలో 23 మంది, మరో ఘటనలో 14 మంది ప్రయాణించారు. తెలంగాణ నార్కట్‌పల్లి-మన రాష్ట్రంలోని అద్దంకిని కలిపే ఆ రహదారిలో అంతవరకూ నాలుగు రోడ్ల లైనులో వేగంగా వచ్చిన వాహనాలు సింగిల్‌లైనులోనూ అదే స్పీడులో రావడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. 2010లో నాలుగులైన్ల రోడ్డు పూర్తయినా.. వివాదాలు పరిష్కారం కాకపోవడంతో ఆ ప్రాంతం ప్రమాదాలకు హాట్ స్పాట్‌గా మారింది. గత మూడేళ్లలో 12 ప్రమాదాలు ఆ ప్రాంతంలో జరిగాయంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మిరపకాయల పని కోసం తెలంగాణ నుంచి బయల్దేరిన 23 మందిలో ఆరుగురు మరణించడం, ఏడుగురు తీవ్రంగా గాయపడటంతో ఆ గిరిజన కుటుంబాల జీవనం చిన్నాభిన్నమైంది. రొయ్యల శుద్ధి పరిశ్రమలో పనిచేసి తిరిగివస్తున్న యానాం ప్రాంతానికి చెందిన ఏడుగురు మహిళలు కాకినాడ జిల్లాలో జరిగిన ప్రమాదంలో మరణించగా, మరో ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రైవేటు ట్రావెల్ బస్సును క్లీనర్ నడుపుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

రహదారులు రక్తసిక్తం కావడం వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వల్ల మరణిస్తున్న వారి సంఖ్య 13 లక్షలకు పైమాటే. మరో రెండు కోట్ల నుంచి ఐదు కోట్ల మంది వరకూ తీవ్ర గాయాల పాలవుతున్నారు. ఈ గాయాల వల్ల వికలాంగులై జీవచ్ఛవాల్లా బతుకుతున్న వారి సంఖ్యే ఎక్కువ. మృతుల సంఖ్యలో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండటం, క్షతగాత్రుల సంఖ్యలో మూడో స్థానంలో ఉండటం... మన దేశంలో రహదారుల భద్రత దుస్థితిని చాటిచెబుతోంది. 2020 లెక్కల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్కులే 69.80 శాతమని కేంద్ర మంత్రి పార్లమెంటులో వెల్లడించారు. 2020లో దేశంలో 3,74,397 మంది మరణిస్తే, 2021లో 3,97,530 మంది బలయ్యారు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్ 40,510 మరణాలతో.. 10.2 శాతం, ఉత్తర ప్రదేశ్ 36,521 మరణాలతో.. 9.2 శాతం ప్రమాదాలతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. మన రాష్ట్రంలో ఏటా నాలుగు శాతం మరణాలు సంభవిస్తున్నాయి. 2021 లెక్కల ప్రకారం 16,044 మంది బలయ్యారు. రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ ఇచ్చిన వివరాల ప్రకారం ప్రమాదాలకు ఆరు ప్రధాన కారణాలున్నాయి. వాటిలో పరధ్యానంగా నడపటం, అత్యధిక వేగంతో నడపటం, మద్యం సేవించి నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, రహదారులు ఛిద్రమై ప్రమాదకరంగా ఉండటం. నూతన సాంకేతిక నైపుణ్యంతో అతి వేగంగా దూసుకెళ్లే వాహనాలు మార్కెట్‌లోకి వస్తుండగా, అందుకు అనుగుణంగా రహదారులు మెరుగుపడటం లేదు. దీంతో, వాహన వేగం ఎందరి ప్రాణాలనో బలిగొంటోంది.

మరోవైపు... రోజురోజుకూ ఉపాధి మార్గాలు కుంచించుకుపోవడం, ఉపాధి హామీకి సైతం సవాలక్ష కొర్రీలు ఉండటం... తదితర కారణాల వల్ల దూర ప్రాంతానికైనా వెళ్లి పనులు చేసే వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతోంది. రోజూ పనులు దొరక్కపోవడంతో కుటుంబం గడవడం కష్టమవుతోంది. దీంతో, భర్తలకు చేదోడువాదోడుగా ఉండేందుకు మహిళలు సైతం పనులకు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలోనే అధిక ఛార్జీలు భరించలేక ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణిస్తూ జీవితాలను బలిపెట్టుకుంటున్నారు. 'బేటీ బచావో.. బేటీ పఢావో..' అని నినాదమిచ్చిన మోడీ ప్రభుత్వం గానీ, అక్కచెల్లమ్మలు అంటూ నిత్యం జపం చేసే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గానీ ఉపాధి, ఉద్యోగ కల్పనకు శ్రద్ధపెట్టింది లేదు. దీంతో, రొయ్యల శుద్ధి లాంటి కష్టమైన పనులు చేస్తూ... ఎటువంటి భద్రత లేని ప్రయాణం చేస్తూ బలవుతున్న వ్యవసాయ కార్మికులు, మహిళలు రాష్ట్రంలో పెరుగుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం కాకుండా ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకునేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

మహనీయుల మాట



తెలివైన వారెవ్వరూ కాలాన్ని క్షణం కూడా వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటారు.

- జాన్ రస్కిన్

ఉద్యమ నిర్మాతగా సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం

ప్రకాశ్ కరత్

మన దేశ కమ్యూనిస్టు ఉద్యమ ప్రసిద్ధ నేతల్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఒకరు. ఉద్యమానికి ఆయన అందించిన అనేకానేక సేవలలో రెండు ప్రధానమైనవి. దీర్ఘకాలం నిలిచి వుండేవి. అందులో ఒకటి పార్టీ నిర్మాణంలో ఆయన నిర్వహించిన పాత్ర. గ్రామసీమలలో వ్యావసాయిక సమస్య పట్ల ఆయన రూపొందించిన మార్క్సిస్టు దృక్పథం.

విప్లవాత్మక పార్టీ నిర్మాణంలో ఆయన పాత్ర గురించి ఈ వ్యాసంలో నేను దృష్టి కేంద్రీకరిస్తాను. తాను 1930లో కమ్యూనిస్టునయ్యానని సుందరయ్య స్వయంగా చెప్పుకున్నారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం నియోగించబడిన అమీర్ హైదర్ ఖాన్ అరెస్టు తర్వాత ఆయన నిర్మాణ దక్షత బాగా ప్రస్ఫుటమైంది. యువ సుందరయ్య పార్టీ ఆర్గనైజర్‌గా 1934లో బాధ్యతలలో ప్రవేశించారు. అప్పుడాయన వయస్సు 22. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కేంద్ర కమిటీలో ఆయన సభ్యుడయ్యారు.

మీరట్ కుట్ర కేసు ఖైదీల విడుదల తర్వాత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం ఏర్పడిన తొలి సంఘటిత వేదిక అదే.

కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికన కమ్యూనిస్టు పార్టీని నిర్మించవలసిన అవసరాన్ని తొలిగా గుర్తించిన వారిలో సుందరయ్య ఒకరు. అలాగే పార్టీకి ఒక అఖిల భారత కేంద్రం వుండాలనీ ఆయన అర్థం చేసుకున్నారు.

సుందరయ్య లోని ఈ విశిష్టతను కామ్రేడ్ బి.టి రణదివే ఆయన అంతిమ యాత్ర సభలో గొప్పగా చెప్పారు. "పార్టీ మూల సూత్రాల కోసం పోరాటం, మరే అంశం కన్నా పార్టీయే సర్వోన్నత్యం కోసం పోరాటం, పార్టీ విప్లవ క్రమశిక్షణ కోసం పోరాటం ఇవే కామ్రేడ్ సుందరయ్య చేసిన పోరాటాలు. ఇవే ఆయనను పార్టీలో అత్యున్నత నాయకుడుగా నిలిపాయి."

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ స్వరూపంలో కీలకమైన అంశం కేంద్రీకృత ప్రజాస్వామ్యం. ఈ ప్రాతిపదికపై పోరాటమే కామ్రేడ్ సుందరయ్య, కామ్రేడ్ బసవపున్నయ్య తదితరులు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నిర్మించేలా చేశాయి. సైద్ధాంతిక రాజకీయ నిర్మాణ రంగాలలో రివిజనిస్టు సూత్రాలపై పోరాటానికి నడిపించాయి.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం విశిష్టత

పార్టీ నిర్మాణంలో కర్తవ్యాలు పేరిట 1967లో రూపొందిన పత్రాన్ని కామ్రేడ్ సుందరయ్య, కామ్రేడ్ బసవపున్నయ్యలు రాశారు. పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం ఈ పత్రం ఉద్దేశం.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ఆ పత్రం ఇలా వివరించింది: మన పార్టీలో పై కమిటీలు పార్టీ సభ్యులతో ఎన్నుకోబడతాయి గనక వారి విశ్వాసం పొందినవారై వుంటారు. అందువల్లనే వారికి పార్టీ వ్యవహారాలు నిర్వహించడానికి అవసరమైన సాధికారత లభిస్తుంది. వ్యక్తి సంస్థ పట్ల విధేయత కలిగి వుండటం, మైనారిటీగా వున్నవారు మెజారిటీకి లోబడి వుండటం, దిగువ కమిటీ పై కమిటీకి లోబడి వుండటం, అన్ని భాగస్వామ్య వ్యవస్థలూ కేంద్ర కమిటీకి లోబడి వుండటం జరగాలి. కేంద్రీకృత అనేది ప్రజాస్వామ్యం నుంచి వేరుగా వుండదు. ఆ ప్రజాస్వామ్యమే దాని ప్రాతిపదికగా వుంటుంది.

'మన పార్టీలో ప్రజాస్వామ్యం అంటే పార్టీ సమావేశాలు జరపడం, సరైన నాయకత్వంలో వాటిని నిర్వహించడం, అవసరమైన సన్నాహాలతో సావధాన చర్చలతో తీర్మానాలు ఆమోదించడం, జాగ్రత్తగా ప్రతిపాదనలు తయారు చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించడం. మా పార్టీలో ప్రజాస్వామ్యం అంటే నాయకత్వం లేని ప్రజాస్వామ్యం కాదు, కుహనా ప్రజాస్వామ్యం గానీ పార్టీలో అరాచకం గానీ కాదు."

"పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఉన్నత ప్రమాణాలకు తీసుకు వస్తేనే ఆ ప్రాతిపదికన పార్టీ నాయకత్వంలో ఉన్నత స్థాయి కేంద్రీకృత నాయకత్వాన్ని సాధించగలం'.

సుందరయ్య దృష్టిలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా నడిచే క్రమశిక్షణాయుతమైన పార్టీ అన్నిటికన్నా కీలకం. వర్గ పోరాటాలు ప్రజా పోరాటాలు పెంపొందించడం, కార్మిక కర్షక ఐక్యత, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం, బూర్జువా భూస్వామ్య రాజ్యం శ్రామికవర్గంపై సాగించే నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడటం ఇవన్నీ కూడా ఆ విధమైన క్రమశిక్షణ గల పార్టీపైనే ఆధారపడి వుంటాయి. 1964 నుంచి 1976 వరకూ ఆయన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పన్నెండేళ్ల కాలంలో ఈ లక్ష్య సాధనకే ఆయన కృషి చేశారు. సరైన మార్క్సిస్టు, లెనినిస్టు మూలసూత్రాల ప్రాతిపదికన అలాంటి పార్టీ నిర్మాణం కోసం మనం సుందరయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలి.



నేడు పి.ఎస్ 38వ వర్ధంతి

> **సుందరయ్య దృష్టిలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా నడిచే క్రమశిక్షణాయుతమైన పార్టీ అన్నిటికన్నా కీలకం. వర్గ పోరాటాలు ప్రజా పోరాటాలు పెంపొందించడం, కార్మిక కర్షక ఐక్యత, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం, బూర్జువా భూస్వామ్య రాజ్యం శ్రామికవర్గంపై సాగించే నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడటం ఇవన్నీ కూడా ఆ విధమైన క్రమశిక్షణ గల పార్టీపైనే ఆధారపడి వుంటాయి. 1964 నుంచి 1976 వరకూ ఆయన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పన్నెండేళ్ల కాలంలో ఈ లక్ష్య సాధనకే ఆయన కృషి చేశారు. సరైన మార్క్సిస్టు, లెనినిస్టు మూలసూత్రాల ప్రాతిపదికన అలాంటి పార్టీ నిర్మాణం కోసం మనం సుందరయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలి.**

దిద్దుకోవలసిన అంశాలు

కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికన పార్టీ నిర్మాణాన్ని, పని విధానాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. సమిష్టి పని విధానం వ్యక్తిగత బాధ్యత, విమర్శ, ఆత్మ విమర్శ పద్ధతిలో పార్టీ కృషిని వ్యక్తిగత కృషిని సమీక్షించుకోవడం అవసరం. పార్టీ శాఖలలో స్వేచ్ఛగా నిర్మొహమాటంగా చర్చల ద్వారా పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయాలి. మెజార్టీ అభిప్రాయాన్ని కమిటీ అభిప్రాయంగా అమలు చేయడం మైనార్టీ అభిప్రాయాన్ని కూడా పార్టీ వేదికలలో వినిపించే అవకాశం వుండేలా హామీ కల్పించడం జరగాలి. పార్టీ కేంద్ర కమిటీ జూన్ నుంచి ఆగష్టు మధ్య కాలంలో దిద్దుబాటు కార్యక్రమాన్ని అమలు చేయాలని పిలుపునిచ్చింది. పార్టీ కమిటీల పని పద్ధతులు తీరు కూడా దిద్దుబాటు అంశాల్లో భాగంగా వున్నాయి. కమిటీలు కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతిలో పని చేయిస్తున్నామా లేదా అనేది మనం పరీక్షించుకోవాలి. కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతి నుంచి వైదొలగడం, ఉల్లంఘించడం ఏమైనా జరిగిందా అని నిశితంగా పరిశీలించి తప్పులను ఎత్తిచూపాలి. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం అంటే పార్టీ కామ్రేడ్స్ ఎవరైనా భిన్నాభిప్రాయం వుంటే పార్టీ వేదికలలో వాటిని వెలిబుచ్చేందుకు హక్కు కలిగివుంటారు. అందుకు ఎలాంటి ఆటంకాలు వుండకూడదు. భిన్నాభి .ప్రాయాలను తొక్కిపట్టే ప్రయత్నం అనుమతించకూడదు. కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అన్వయించడం అంటే ఒకసారి నిర్ణయం తీసుకున్నాక మెజార్టీ అభిప్రాయం సమిష్టి నిర్ణయం అవుతుంది. వ్యక్తిగత అభిప్రాయాలు లేదా మైనార్టీ అభిప్రాయం గలవారు కూడా దాన్ని ఆమోదించి అమలు చేయాలి. మైనార్టీ అభిప్రాయాన్ని బేఖాతరు చేయడం గానీ పార్టీ వెలుపల వ్యక్తిగత అభిప్రాయాలు లేదా మైనార్టీ అభిప్రాయం అమలుకు ప్రయత్నించడం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. ఇది ముఠాతత్వానికి లేదా గ్రూపులు కట్టడానికి దారితీస్తుంది.

అదే సమయంలో నిరంకుశాధికార పద్ధతులు గానీ, వ్యక్తిగత అభిప్రాయాల లేదా మైనార్టీ అభిప్రాయాలను తొక్కిపట్టడానికి ప్రయత్నించడం కూడా కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతులకు వ్యతిరేకమే. పార్టీ నిబంధనావళిలో పొందు పర్చబడిన కేంద్రీకృత ప్రజాస్వామ్యం అన్ని కోణాలనూ అమలు చేసేవిధంగా కమిటీలు పనిచేస్తున్నాయా అనే విషయాన్ని అన్ని కమిటీలు సమీక్షించవలసి వుంటుంది.

వ్యక్తిగత ధోరణి, స్వీయ మానసిక దోరణి, నిరంకుశాధికార పోకడలు, ఉదారవాదం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ఉల్లంఘనకు మూల కారణాలుగా వస్తున్నాయని నిర్మాణంపై కోల్‌కతా ప్లీనం నిర్దిష్టంగా ఎత్తిచూపింది. సమీక్షలో అలాంటివి వున్నాయని గుర్తిస్తే వాటిని దిద్దుకోవడానికి చర్యలు చేపట్టాలి.

పార్టీ పనికి వచ్చే కార్యకర్తలను గుర్తించడం వారిని తీర్చిదిద్దడం అనే మరో గొప్ప లక్షణం సుందరయ్యలో వుండేది. తొలి రోజుల్లో ఆయన ఆంధ్ర తెలంగాణలలో పార్టీ శాఖలు స్థాపించడం మొదలుపెట్టినప్పుడు తర్వాత తను పార్టీ కేంద్రంలో ఆర్గనైజర్‌గా బాధ్యతలు అప్పగించబడినప్పుడు ఈ లక్షణం ప్రస్ఫుటమైంది.

క్యాడర్ విధానం కీలకం

1967 నిర్మాణ రంగంలో మన కర్తవ్యాలు అనే సిద్ధాంత పత్రం ఆయన ప్రధాన కార్యదర్శిగా వున్నప్పుడే ఆమోదించబడింది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తల పట్ల సరైన క్యాడర్ విధానం రూపొందించుకోవడంలో వైఫల్యాన్ని ఆ పత్రం సూటిగా పేర్కొంది. మార్క్సిజం, లెనినిజంకే అంకితమైన క్యాడర్ లేకుండా ఒక కమ్యూనిస్టుపార్టీ గాని విప్లవోద్యమం గాని నిర్మించడం సాధ్యం కాదు. ఇందుకోసం భవిష్యత్తులో ఉపయోగపడే పార్టీ కార్యకర్తలను గుర్తించాలి. వివిధ తరగతుల ప్రజలలో పని చేసేందుకు అవసరమైన విధంగా వారిని అభివృద్ధి చేసి శిక్షణ ఇవ్వాలి. పూర్తికాలం కార్యకర్తల, వారి కుటుంబాల కనీస అవసరాలకు తగువిధంగా పార్టీ ఏర్పాట్లు చేయాలి. దురదృష్టవశాత్తూ మనం ఈనాటి అవసరాలకు తగినట్టుగా ఈ క్యాడర్ విధానం అమలుపర్చలేకపోతున్నాం. మన పూర్తికాలం కార్యకర్తలు వివిధ స్థాయిల్లో రాజకీయ నిర్మాణ వ్యవహారాల నాయకులుగా వుండాలి. కాని మన లోపభూయిష్టమైన దృష్టి కోణం కారణంగా చాలామంది కార్యకర్తలు కేవలం పని చేసే (ఉద్యోగస్తులుగా) వారిగా మిగిలిపోతున్నారు.

నాయకత్వ స్థాయి కార్యకర్తలకు అవసరమైన రాజకీయ, సైద్ధాంతిక స్థాయి లేకుండా పోతున్నది. అందువల్ల పార్టీ నిర్మాతగా సుందరయ్య పని విధానం నుంచి నేర్చుకోవలసిన ఒక అతి ముఖ్యమైన పాఠం పార్టీ క్యాడర్‌ను పెంపొందించడం, తీర్చిదిద్దడం. ఆయన వేసిన బాటలో ముందుకు సాగుదాం. సిపిఐ(ఎం)ను, కమ్యూనిస్టు ఉద్యమాన్ని శక్తివంతం చేసి ముందుకు నడిపించేందుకు మనం చేసే పోరాటంలో మనం సుందరయ్య అందించిన ఈ మహత్తర వారసత్వాన్ని కొనసాగించేందుకు దీక్షబూనుదాం.

(వ్యాసకర్త: సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి)

జనవాక్యం

వసతులు లేని స్థలమా...

రాజధాని విశాఖ అంటారు, అమరావతిలో ఎటువంటి మౌలిక వసతులు లేకుండా, ఉపాధి లేకుండా సెంటు స్థలం ఇచ్చి ఎవరిని మోసం చేస్తున్నారు? భూములు ఇచ్చిన రైతులకు కౌలు డబ్బులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీసుకొచ్చారు. రాష్ట్ర హైకోర్టుకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయని పాలకులు పేదలకు స్థలం ఇవ్వడం వలన ఎటువంటి ఉపయోగం ఉండదు. ప్రజావేదిక కూలగొట్టారు, కనీసం ఆ వ్యర్థాలను కూడా తొలగించలేదు ఎందుకో మరి?!

- కంభంపాటి కోటేశ్వరరావు, మురళి నగర్, విశాఖపట్నం.

జడ్జీల భర్తీ

తాజాగా, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదోన్నతిపై సుప్రీంకోర్టుకు బదిలీ కావడంతో రాష్ట్ర హైకోర్టులో ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులు ఏడుకు పెరిగాయి. పలు కారణాలతో, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ వివాదాస్పద నిర్ణయాలతో ప్రతి చిన్న విషయానికి సామాన్యులు సైతం కోర్టు గుమ్మం ఎక్కవలసి వస్తున్నది. దీంతో కేసుల సంఖ్య రోజు రోజుకీ అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. ప్రజలకు సత్వర న్యాయం చేకూరాలంటే ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులు సత్వరం భర్తీ చేయాలి. అలాగే జిల్లా, సబార్డినేట్ కోర్టుల, వివిధ ట్రిబ్యునల్, లోకాయుక్త కార్యాలయల్లో ఖాళీలను యుద్ధ ప్రాతిపదికపై భర్తీ చేయాలి.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా.

గొంతులెండుతున్నాయ్

గత వారం రోజుల నుంచి నుంచి వేసవి ఎండలు ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. పగటి వేళల్లో బయటకు రావటానికి జనం సంకోచిస్తున్నారు. వచ్చిన ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కూడలి లోనే మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారులకు దాహం తీర్చాలి. ఇటీవల సెంటరులో స్వచ్ఛంద సంస్థలు మంచి నీటి కేంద్రాలు పెట్టి ప్రజల గొంతు తడుపుతున్నాయి. అవి కొంత వరకే. ప్రజలకు ఉపశమనం కలిగిస్తాయి. పూర్వ కాలంలో వేసవిలో ప్రజలు దాహార్తిని తీర్చడానికి పాలకులు మజ్జిగ కేంద్రాలను పెట్టినట్టు చరిత్రకారులు తెలుపుతున్నారు. కావున వేసవి ఎండల తీవ్రత తగ్గే వరకు మజ్జిగ రసాన్ని బాటసారులకు అందించాలి.

- జి.సూర్యనారాయణ, బందలాయి చెరువు, కృష్ణా జిల్లా.

నిరుద్యోగులూ మోసపోవద్దు!

వివిధ ప్రభుత్వ శాఖల్లో, విద్యాలయాల్లో ఖాళీలు ఉన్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు అధికార పార్టీ నేతలు, దళారులు నిరుద్యోగుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బు గుంజుతున్న వార్తలు నిత్యం పత్రికల్లో వస్తున్నాయి. నిరుద్యోగులు ఇలాంటి వారి ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకోవద్దు. ఉన్న ఉద్యోగులకే జీతాలు చెల్లించే పరిస్థితి లేదు! ఇంకా కొత్తగా నియామకాలు ఎండమావే! దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న దుర్బుద్ధితో నిరుద్యోగులకు వల వేస్తున్నారు. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా పోయిన డబ్బు తిరిగి రాదు. ఎదురు కేసులు పెట్టే దుస్థితి నెలకొంది! వాస్తవ పరిస్థితి గుర్తెరిగి నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలి!

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

వ్యాఖ్య

సైనిక కూటమి లోకి జారుతున్న భారత్!

PEOPLE'S DEMOCRACY


అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, ఇండియా ఈ నాలుగు దేశాలతో కూడిన క్వాడ్ క్రమంగా భద్రతా కూటమిగా రూపు దిద్దుకుంటోంది. ఈ గ్రూపునకు మొదట పెట్టిన పేరు - క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్ - ఉద్దేశ్యం కూడా ఇదే.

మే 15-17 తేదీల్లో కాలిఫోర్నియా లోని సన్నీల్యాండ్స్‌లో నాలుగు క్వాడ్ దేశాల మిలిటరీ చీఫ్‌లు జరిపిన సమావేశం ద్వారా ఈ భద్రతా కోణం ప్రముఖంగా తెరపైకి వచ్చింది. భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనీల్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరయ్యారు. 'ఇండో-పసిఫిక్ కమాండ్' కమాండర్ అడ్మిరల్ జాన్ సి.అక్విలినో అమెరికా తరపున పాల్గొన్నారు.

హిరోషిమాలో జి-7 దేశాల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా క్వాడ్ సదస్సును కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మిలిటరీ చీఫ్‌ల మొదటి సమావేశం జరిగింది. తొలుత మే 24న ఆస్ట్రేలియాలో ఈ సదస్సు జరగాల్సి వుంది. అయితే అమెరికా అధ్యక్షుడు బైడెన్ తన పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. క్వాడ్ దేశాల నేతలు ముఖాముఖి సమావేశం కావడం ఇది మూడోసారి. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు.

అమెరికాకు సంబంధించినంతవరకు, క్వాడ్ అనేది చైనాకు వ్యతిరేకంగా నిర్దేశించబడిన భద్రతా కూటమిగా ఉద్దేశించబడింది. "స్వేచ్ఛా, బహిరంగ ఇండో-పసిఫిక్", సముద్ర జలాల భద్రత, మానవతా, విపత్తు సహాయ కార్యకలాపాలకు సహకారం వంటి సాధారణ సూత్రీకరణల చాటున భారత్ క్వాడ్‌లో చేరింది.

గతేడాది ఫిబ్రవరిలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జై శంకర్ మాట్లాడుతూ, క్వాడ్ అనేది 'ఒకదాని కోసం, అంతేకానీ మరొకరికి వ్యతిరేకంగా కాదు' అని వ్యాఖ్యానించారు. కానీ ఇదంతా కేవలం కుతంత్రం. చైనాను ఒంటరిని చేసి, ఎదుర్కొనేందుకు అమెరికా అనుసరించిన ఇండో-పసిఫిక్ వ్యూహానికి అనుగుణంగా భారత్ ఆ వలలో పడిపోయిందన్నది వాస్తవం. ఈ ఏడాది ఆగస్టులో మలబార్ నావికా విన్యాసాలు నిర్వహించాలన్నది సైనిక సహకారం పొడిగింపునకు సంబంధించిన మరో అంశం. ఈ విన్యాసాల్లో ఆస్ట్రేలియాను కూడా కలుపుకోనున్నారు.



కాలిఫోర్నియా సమావేశంలో భారత్ పాల్గొనడంపై భారత్ భద్రతా సంస్థకు సంబంధించిన అధికారి ఒకరు మీడియాకు వివరించారు. "సరిహద్దుల్లో చైనా దూకుడు వైఖరిని గమనంలోకి తీసుకుంటే సరిహద్దు సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకునే ఉద్దేశ్యం లేనట్లు కనిపిస్తున్నందున, సరిహద్దుల్లో పిఎల్‌ఎ విశృంఖలమైన దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు క్వాడ్ వంటి బహుముఖ వేదికల నుండి సాయం తీసుకోవాలని భారత్ నిర్ణయించాల్సి వచ్చింది." అని చెప్పారు. అమెరికాతో, ఇండో-పసిఫిక్ లోని అమెరికా మిత్ర దేశాలతో సైనిక సహకారంతో ముందుకు సాగడాన్ని భారత్ ఈ రకంగా సమర్థించుకుంది.

ఇండో-పసిఫిక్ వ్యూహంలో భారత్‌ను ఎందుకు కావాలనుకుందో, అసలు ఎలాంటి పాత్ర పోషించాలనుకుందో చెప్పడానికి అమెరికా వద్ద కచ్చితమైన కారణం లేదా సమాచారం లేదు. అమెరికాతో మోడీ ప్రభుత్వం పొత్తు పెట్టుకుంది కేవలం ఇండో-పసిఫిక్ ప్రాంతంలోనే కాదు, పశ్చిమాసియాలో ఏర్పాటు చేసిన క్వాడ్‌లోనూ భారత్ చేరింది. ఇందులో భారత్, ఇజ్రాయిల్, అమెరికా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వున్నాయి. దీన్నే ఐ2యు2గా కూడా పిలుస్తారు. మళ్ళీ అమెరికా ఆధ్వర్యంలోనే మే 7న సౌదీ అరేబియాలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సౌదీ ప్రధాని మహ్మద్ బిన్ సల్మాన్ అమెరికా, భారత్, యుఎఇ జాతీయ భద్రతా సలహాదారులతో భేటీ అయ్యారు. భారత్‌కు అనుసంధానించబడే ప్రాంతంలో మౌలిక వసతులను నిర్మించడం, సహకారాన్ని బలోపేతం చేయడం ఈ సమావేశం ఎజెండాగా వున్నాయి. చైనా ప్రభావం పెరుగుతుండడం, పైగా దౌత్య సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి, సాధారణ సంబంధాలను నెలకొల్పుకునేందుకు సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదిరేలా చైనా దౌత్యపరమైన జోక్యం చేసుకోవడం పట్ల అమెరికా ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ చర్యను చూడాల్సి వుంది.

చైనాకు వ్యతిరేకంగా అమెరికా తీసుకుంటున్న దూకుడు విన్యాసాలకు, భారత్‌ను కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యలకు వ్యూహాత్మక నిపుణులు, కార్పొరేట్ మీడియాలోని వ్యాఖ్యాతల నుండి ప్రశంసలు వచ్చాయి. భారత్-అమెరికా కూటమి ప్రయోజనాల గురించి, వారి ఆసక్తులు కలవడం గురించి ఆర్భాటంగా చెప్పుకుంటున్నారు. కానీ దానికి విరుద్ధంగా ప్రత్యామ్నాయ వైఖరికి ప్రజా కార్యాచరణలో ఎలాంటి స్థానం దక్కడం లేదు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తన గుత్తాధిపత్యాన్ని పరిరక్షించుకోవడంలోనే అమెరికా ఆసక్తి కనబరుస్తోందన్నది ఇక్కడ గ్రహించాలి. ఎందుకంటే, చైనాకు పెరుగుతున్న బలం, దాని ప్రభావంతో అమెరికా గుత్తాధిపత్యం రాన్రానూ అధికంగా సవాలు చేయబడుతోంది. ప్రపంచంలో బహుళ ధృవ ప్రభావం పెరుగుతున్నపుడు, అమెరికాకు మిత్రపక్షాలుగా వున్న ఒక మోస్తరు దేశాలు కూడా తమ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ధృఢంగా చెప్పుకోవాలని భావిస్తున్నపుడు, అమెరికా నేతృత్వంలోని వ్యూహంలో, భద్రతా కూటముల్లో చిక్కుకోవడమంటే భారత్‌కు దూరదృష్టి లేకపోవడమే అవుతుంది. చైనాతో భారత్‌కు వున్నది ప్రాథమికంగా సరిహద్దు వివాదమే. చైనా ఇటీవల తీసుకున్న చర్యల కారణంగా వాస్తవాధీన రేఖ వద్ద శాంతి భద్రతల పరిరక్షణ అనేది దిగజారుతోంది. రెండు దేశాలు కూర్చుని మాట్లాడుకుని, పరస్పరం పరిష్కరించుకోవాల్సిన సమస్యే ఇది. అయితే ఓపికతో, కృత నిశ్చయం, దృఢదీక్షతో ఈ ప్రక్రియను అనుసరించాల్సి వుంటుంది.

> **ప్రపంచంలో బహుళ ధృవ ప్రభావం పెరుగుతున్నపుడు, అమెరికాకు మిత్రపక్షాలుగా వున్న ఒక మోస్తరు దేశాలు కూడా తమ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ధృఢంగా చెప్పుకోవాలని భావిస్తున్నపుడు... అమెరికా నేతృత్వంలోని వ్యూహంలో, భద్రతా కూటముల్లో చిక్కుకోవడమంటే భారత్‌కు దూరదృష్టి లేకపోవడమే అవుతుంది. చైనాతో భారత్‌కు వున్నది ప్రాథమికంగా సరిహద్దు వివాదమే. చైనా ఇటీవల తీసుకున్న చర్యల కారణంగా వాస్తవాధీన రేఖ వద్ద శాంతి భద్రతల పరిరక్షణ అనేది దిగజారుతోంది. రెండు దేశాలు కూర్చుని మాట్లాడుకుని, పరస్పరం పరిష్కరించుకోవాల్సిన సమస్యే ఇది.**

అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంబంధాల్లో చైనా చాలా కీలక పాత్ర పోషిస్తున్నదన్న వాస్తవాన్ని గమనంలోకి తీసుకుంటే చైనాతో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు బలహీనపడడం వల్ల భారత్‌కు కలిసొచ్చేది ఏమీ లేదు. గల్వాన్ ఘర్షణల అనంతరం కూడా సంబంధాల్లో కాస్తంత విరామం వచ్చినప్పటికీ 2022లో ద్వైపాక్షిక వాణిజ్యం పెరిగి 135.98 బిలియన్ల డాలర్లుగా వుంది. చైనా ఆర్థిక వ్యవస్థ నుండి విడిపోవడం గురించి, బదులుగా ముప్పు లేని ఆర్థిక సంబంధాల గురించి అమెరికా కూడా మాట్లాడడం ఆపేసింది. అయితే చైనాతో ఆర్థిక సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని భారత్‌లోని కొన్ని వర్గాల్లో నెలకొన్న ప్రస్తుత ఆలోచనా ధోరణి కచ్చితంగా మనకే హాని కలిగిస్తుంది.

ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్‌కు అపారమైన ఆర్థిక అవకాశాలు వున్నాయి. తన స్వంత ప్రయోజనాలను మరింత ముందుకు తీసుకుని వెళ్ళేందుకు బహుళ ధృవ ప్రభావాన్ని పెంచుకుంటూ, ఇతర అన్ని ప్రధాన దేశాలతో, ప్రాంతాలతో ఫలవంతమైన సంబంధాలు నెలకొల్పుకునే స్థానంలో భారత్ వుంది. అంతేకానీ అమెరికా ఒక్క దేశానికే కట్టుబడి వుండిపోవడమనేది ముందుకు సాగే మార్గం కాదు.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

రేపు ఎన్‌టిఆర్ శతజయంతి సభ

హాజరుకానున్న సినీ, రాజకీయ ప్రముఖులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో శనివారం జరగనున్న సభకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ ఛైర్మన్ టిడి జనార్దన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యఅతిథిగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, ప్రత్యేక అతిథిగా నందమూరి బాలకృష్ణ, గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా హర్యానా గవర్నరు బండారు దత్తాత్రేయ, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, బిజెపి నేత పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కన్నడ నటులు శివకుమార్, తెలుగు నటులు జూనియర్ ఎన్‌టిఆర్, అల్లు అర్జున్, ప్రభాస్, దగ్గుబాటి వెంకటేష్, సుమన్, మురళీమోహన్, నందమూరి కల్యాణ్‌రామ్, జయప్రద, దర్శకులు కె రాఘవేంద్రరావు, ప్రముఖ నిర్మాతలు జి అదిశేషగిరిరావు, సి అశ్వనీదత్, ఇతర సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సావనీర్, వెబ్‌సైట్ ఆవిష్కరణలతోపాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, పలువురు ప్రముఖులు కమిటీ పురస్కారాలు అందించనుందని వెల్లడించారు. ఎన్‌టిఆర్ సమగ్ర సినీ, రాజకీయ జీవితంలో ఆయనతో సన్నిహితంగా మెలిగిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, దర్శకులు, పాత్రికేయులు, సహచర రాజకీయ నాయకులు, వివిధ పార్టీల నేతలు, ఎడిటర్లు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ప్రత్యేకంగా రాసిన వ్యాసాలను సంకలనం చేసిన 'శకపురుషుడు' ప్రత్యేక సావనీర్‌ను, 'జై ఎన్‌టిఆర్' వెబ్‌సైట్‌లను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.

ఆగని వడగాడ్పులు

- అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గత రెండురోజులతో పోల్చితే స్వల్పంగా తగ్గినా వడగాడ్పులు మాత్రం తగ్గలేదు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం 29 మండలాల్లో వడగాడ్పులు తీవ్ర ప్రభావం చూపనున్నట్లు పేర్కొన్నారు. కడప జిల్లాలోని ఎనిమిది మండలాల్లో ఈ వడగాడ్పుల ప్రభావం తీవ్రంగా వుంటుందని తెలిపారు. అనకాపల్లి, విజయనగరం, మన్యం జిల్లాలో ఐదేసి మండలాల్లో, ఎన్‌టిఆర్, పల్నాడు జిల్లాల్లో రెండేసి, గుంటూరు, కాకినాడ జిల్లాల్లో ఒక్కో మండలంలో వడగాడ్పులు వీచే అవకాశం వుందని అన్నారు. గురువారం రాష్ట్రంలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 45.1 డిగ్రీలు నమోదైంది. పల్నాడు జిల్లా మాచర్ల, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, కడప జిల్లా బద్వేల్‌లో 45 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా సింహాద్రిపురం, పల్నాడు మండలంలో తీవ్ర వేడిగాలులు వీచాయి. రాష్ట్ర వ్యాప్తంగా మరో 27 మండలాల్లో వేడిగాలులు వీచినట్లు తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం వుందని తెలిపారు. అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 43 డిగ్రీలు, కోనసీమ, పశ్చిమగోదావరి, సత్యసాయి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం వుందని పేర్కొన్నారు.

లాసెట్ ప్రవేశ పరీక్షకు పగడ్బందీగా ఏర్పాట్లు

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఎపి లా సెట్, ఎపి పిజి ఎల్‌సెట్- 2023కు విశేష స్పందన లభించినట్లు వర్సిటీ రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, లా సెట్ కన్వీనర్ బి.సత్యనారాయణ అన్నారు. గుంటూరులోని నాగార్జున వర్సిటీలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బి 3, 5 సంవత్సరాలు, ఎల్‌ఎల్‌ఎం కోర్సులలో ప్రవేశాలకు పరీక్షను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులో సాధించిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల పరిధిలోని సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో ఎల్‌ఎల్‌బి మూడేళ్ల కోర్సు నందు 5,220 సీట్లు, ఎల్‌ఎల్‌బి ఐదేళ్ల కోర్సు నందు 2,547, ఎల్‌ఎల్‌ఎం నందు 379 సీట్లు కలవని తెలిపారు. మొత్తం 8,176 సీట్లు ఉన్నాయని, ఇప్పటి వరకు మొత్తం 19,014 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3 నుండి 4:30 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. నిమిషం ఆలస్యమైన అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు 15 నుంచి https://wwe.cets.apsche.ap.gov.in/lawcet వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఫస్ట్ ఫేస్ కౌన్సెలింగ్ ఆగస్ట్ 16 నుంచి 24 వరకు, సెకండ్ ఫేస్ సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 11 నుంచి తరగతుల ప్రారంభమవుతాయని తెలిపారు.

ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అవమానించేలా మాట్లాడిన చంద్రబాబు తక్షణం పేద ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే చంద్రబాబు ఓర్వలేక పెందుర్తి సభలో అవమానించేలా మాట్లాడారని అన్నారు. తమ హయాంలో రెండు సెంట్ల స్థలాలను పేదలకు ఇచ్చామని చెబుతున్న చంద్రబాబు రాష్ట్రంలో ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు.

29న జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటించాలి

- ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న డిమాండ్స్ డేను జర్నలిస్టులు పాటించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు బుధవారం విజయవాడలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశపు వివరాలను తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని బందర్ రోడ్డులో వున్న ఠాగూర్ గ్రంథాలయం కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలను చర్చించామన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు మంజూరు చేసే అంశంలో ప్రభుత్వం నిబంధనలను సడలించి అర్హులైన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 29న డిమాండ్స్ డేను పాటించాలని కోరారు.

ఆరోగ్య శ్రీ సేవలు యథాతథం

- కొంత బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఆరోగ్య శ్రీ కింద చేసిన చికిత్సలకు ప్రైవేటు ఆస్పత్రులకు బకాయిలు పేరుకుపోయాయి. వీటిని విడుదల చేయాలన్న డిమాండ్‌తో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశ) శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని కొంత బకాయిలను ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించింది. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ట్రస్టు సిఇఒ జి వంశీకృష్ణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 30న రూ.201 కోట్లు, ఈ నెల 15న రూ.205 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. గురువారం కూడా రూ.368 కోట్లు మొత్తంగా రూ.774 కోట్లు బకాయిలను ఆస్పత్రులకు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన బకాయిలు, ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరిస్తుందని వెల్లడించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆశ అసోసియేషన్ ఆరోగ్యశ్రీ సేవలకు ఎటువంటి అంతరాయం, అసౌకర్యం లేకుండా కొనసాగిస్తామని హామీ ఇచ్చిందని వంశీకృష్ణ తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలాంటి అసౌకర్యం లేకుండా కొనసాగుతాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు.

పోలవరం నిర్వాసితుల అభ్యున్నతికి చర్యలు

- పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)



పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన గిరిజన బాధితులను అభ్యున్నతికి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన గిరిజన బాధితుల పొలాలు అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, వివిధ రకాలైన వ్యాపారాలు చేసుకొనుటకు రుణాలు మంజూరు తదితర అంశాలపై గురువారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన సుమారు 5,800 గిరిజన కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఆదుకోవడం జరుగుతుందని చెప్పారు. భూమికి భూమి ఇవ్వడం జరుగుతుందని, ఆ భూముల్లో రైతులు నచ్చిన పంటలు వేసుకునే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. గిరిజనులు ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలలో ఉన్న వారికి ఉపాధి హామీ పనులు కల్పిస్తామన్నారు. ఈ భూములకు సాగునీరుఉన్నది లేనిది పరిశీలించి సర్వే చేసి నివేదికల సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రైతుల ఆసక్తి మేరకు విత్తనాలు సరఫరాకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. పిడిఎఫ్ 5వేల కుటుంబాలకు నిధులు వచ్చాయని, అర్హులైన గిరిజనులను రీ సెటిల్మెంట్లు చేస్తామని చెప్పారు. నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీడీఏ పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి వ్యవసాయం సాగు చేయడానికి ఏమి కావాలో సర్వేలో తెలుసుకొని నివేదికల సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, డిపిఎం పరమేశ్వరరావు, ఎడిఎలు సిహెచ్‌కెవి చౌదరి, కె.సావిత్రి, అగ్రికల్చరల్ అధికారి ఎల్.రాంబాబు. ఏపీఈపీడీసీఎల్ డిఇ ఎ.వెంకటేశ్వరరావు, ఎఇ.దొరబాబు, ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్, తహశీల్దార్లు శ్రీధర్, అనసూయ, డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో రత్నకుమారి, ఉపాధి ఏపీవోలు, వెలుగు ఎపిఎంలు, హార్టికల్చర్, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం

- ఈదురుగాలులకు నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- 12 గంటల పాటు అంధకారం
- మామిడి రైతు కుదేలు

ప్రజాశక్తి - యంత్రాంగం (శ్రీకాకుళం జిల్లా)



శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పలాస, పోలాకి మండలాల్లో బుధవారం అర్ధరాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో బలంగా వీచిన ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో 40 పైబడి విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తెగిపడడంతో సుమారు 12 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంతబొమ్మాళి మండలంలోని యామలపేట, నౌపడ, సీతానగరం, మర్రిపాడు గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. యామలపేట, నౌపడలో వర్షానికి కాలువలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరి అర్ధరాత్రి ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. విద్యుత్‌శాఖ ఇఇ వి.ఎ రాజశేఖర్, డిఇ ఎస్.శ్రీనివాసరావు, ఎఇ ఎం.శివకుమార్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. దీంతో పలుచోట్ల గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతకు వృద్ధులు, రోగులు, పిల్లలు ఇబ్బందులు పడ్డారు. సంతబొమ్మాళి పంచాయతీ అంట్లువరం వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ పాసేజ్ గోడ వర్షానికి కొంత భాగం కూలిపోయింది. చిన్నపాటి వర్షానికే గోడ కూలిపోవడంతో నాణ్యతా లోపంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పలాసలో పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.

మామిడి రైతు కుదేలు

గాలివాన భీభత్సంతో మామిడి రైతులు కుదేలయ్యారు. ఈదురుగాలులకు మామిడి పళ్లు నేలరాలాయి. కోటబొమ్మాళి మండలంలో సుమారు 550 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. ఊడికలపాడు, కోటబొమ్మాళి, కన్నేవలస, పాకివలస, దంత, కురుడు, లఖందిడ్డి, నిమ్మాడ, మూలపేట, తిలారు, బంజీరుపేట, హరిశ్చంద్రపురం, జీయన్నపేట, యలమంచిలి, కిష్టుపురం, బలరాంపురంతో పాటు పలు గ్రామాల్లో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గాలివాన వల్ల రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని మామిడి తోటల రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. అకాల వర్షాలకు అపరాలు, కూరగాయల పంటలు, మొక్కజొన్న తీవ్రంగా దెబ్బతిన్నాయి. జీడి, మినుమ, పెసర, మిరప, చిక్కుడు, బీర, బెండ, అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మామిడి రైతులు లక్షలు అప్పులు చేసి మామిడి తోటలను కొనుగోలు చేశామని, వరుణుడు దెబ్బకు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు స్టే ను అమలు చేయాలి

- గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్శ

ప్రజాశక్తి పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలం కేటాయింపుపై హైకోర్టు స్టే ఇచ్చినా నిర్మాణ పనులు చేయడం కోర్టు ధిక్కరణ కింద వస్తుందని, స్టేను అమలు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్శ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలో వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలం కేటాయించిన భూమిని అప్పలనర్శ గురువారం పరిశీలించారు.కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి నిర్మాణ పనులు చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన భూ బాధిత కుటుంబాలతో కలిసి పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనర్శ విలేకరులతో మాట్లాడుతూ, 1/70 చట్టాన్ని దిక్కరించి వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలం కేటాయింపు చేయడం అన్యాయమన్నారు. హైకోర్టు స్టే విధించినా వైసిపి ఆఫీస్ నిర్మాణానికి స్థలంలో పనులు నిలుపుదల చేయకపోవడంపై భూ బాధిత కుటుంబాలు పనులు జరిగే చోటకు వెళ్లి పనులు నిలుపుదల చేయాలని కోరితే మీ దిక్కు ఉన్న చోట చెప్పుకోమని చెప్పడం సరికాదన్నారు. న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉంటే తక్షణమే వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి కేటాయించి స్థలంలో పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. సుందరరావు, మండల అధ్యక్షుడు ఎస్.చిట్టి బాబు, సత్తిబాబు, కొండలరావు పాల్గొన్నారు.



ప్రపంచానికి మార్గదర్శి మార్క్సిజమే

● నవతెలంగాణ నూతన వెబ్‌సైట్ ప్రారంభోత్సవంలో తమ్మినేని

ప్రజాశక్తి-హైదరాబాద్

మార్క్సిజం, లెనినిజం విశ్వసిద్ధాంతమని, ఇదే ప్రపంచానికి మార్గదర్శి అని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నవతెలంగాణ దినపత్రిక నూతన వెబ్‌సైట్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఎమ్‌హెచ్ భవన్‌లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభించారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా రూపొందించిన ప్రత్యేక పేజీలను సిజిఎం ప్రభాకర్ ప్రారంభించారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిజిఎం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని రాజకీయ పరిణామాలను వివరించారు. సుందరయ్య స్ఫూర్తిని కల్పిన ఆదర్శ రాజకీయ నేత అని కొనియాడారు. కమ్యూనిస్టు మేనిఫెస్టోను భారతదేశ పరిస్థితులకు అన్వయించిన దార్శనికుడని అన్నారు. ఆదర్శం, నిరాడంబరత కల్గిన నేత అని, కార్యకర్తల పట్ల ప్రేమను చూపించేవారని తెలిపారు. భావజాల రంగంలో పత్రికలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రస్తుత రాజకీయాలను అర్థం చేసుకుని, ప్రజలను చైతన్యవంతం చేసే బాధ్యత పత్రికల మీద ఉందని అన్నారు. సిజిఎం ప్రభాకర్ మాట్లాడుతూ పత్రికా రంగంలో డిజిటల్ రంగం వేగంగా విస్తరిస్తోందని అన్నారు. అందులో భాగంగానే ఇ-పేపర్ తీసుకొచ్చామని, దీన్ని 25లక్షల మందికి పైగా చూస్తున్నారని తెలిపారు. ఇన్‌చార్జి ఎడిటర్ రాంపల్లి రమేష్, స్వేచ్ఛ ఇన్‌చార్జి ప్రవీణ్ తదితరులు ప్రసంగించారు. నవతెలంగాణ బుక్ హౌస్ ఎడిటర్ ఆనందాచారి, 10 టివి మాజీ ఎమ్‌డి వేణుగోపాల్, స్వేచ్ఛ ఇన్‌ఛార్జి ప్రతినిధులు భువన్, దివ్య, నవతెలంగాణ వెబ్ డెస్క్ ఇన్‌ఛార్జి అనంతోజు మోహన్ కష్ణ, నవతెలంగాణ బోర్డు సభ్యులు, జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

124 ఇళ్ల కూల్చివేతకు నోటీసులు

● సెంట్రల్ ఢిల్లీలో అధికారుల తీరు ● పునరావాసం లేకుండా కూల్చివేయడం రాజ్యాంగ విరుద్ధం: నిర్వాసితులు, కార్యకర్తలు

న్యూఢిల్లీ : దేశరాజధాని న్యూఢిల్లీలోని డాక్టర్ రాజేందర్ ప్రసాద్ రోడ్‌లోగల మెరిడియన్ హెూటల్ వెనుక ఉన్న దాదాపు 124 కుటుంబాలకు ఇళ్ల కూల్చివేత నోటీసులు అందాయి. ఈనెల 16న సంబంధిత అధికారులు వారికి ఈ నోటీసులు పంపారు. 1995 నుంచి ఈ కుటుంబాలు అక్కడి జెజె క్లస్టర్‌లో నివసిస్తున్నాయి. ఈ కుటుంబాల్లో 200 మంది పిల్లలు, 100 కంటే ఎక్కువ మంది మహిళలు సహా 500 మందికి పైగా పౌరులు ఉన్నారు. ఈ చర్య సమీపంలోని ఇండ్లు, కార్యాలయాల్లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న ప్రజల జీవనోపాధిపై దెబ్బ చేయడమేనని నిర్వాసితులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ల్యాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ వారికి ఈ నోటీసులను జారీ చేసింది.

మజ్దూర్ ఆవాస్ సంఘర్ష్ సమితి కన్వీనర్ నిర్మల్ గోరనా అగ్ని మాట్లాడుతూ.. "అధికారులు బలవంతంగా ఖాళీ చేయాలని ప్రజలను వేధించారు. బెదిరించారు. నివాసితులు ఎక్కువగా నిరక్షరాస్యులు. దళిత వర్గానికి చెందినవారు. బాలల హక్కుల కోసం, మురికివాడల నివాసితులకు పునరావాసం కల్పించడంపై వారి తరఫున మజ్దూర్ ఆవాస్ సంఘర్ష్ సమితి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సిటీబ్యూటీ, మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్, ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్, ఢిల్లీ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్‌కు ఒక విజ్ఞాపన పత్రాన్ని పంపింది" అని చెప్పారు. 2015కు ముందు నుంచి బస్తీలో నివసిస్తున్నట్లు తమ వద్ద పత్రాలు ఉన్నాయని నిర్వాసితులు తెలిపారు. బస్తీ 675 జెజె బస్తీల జాబితాలో ఉన్నందున ప్రతిపాదిత కూల్చివేత చట్టవిరుద్ధమని వారు ఆరోపిస్తున్నారు. మురికివాడల నివాసితులు జీవనోపాధిని కోల్పోకుండా రక్షించడానికి జోక్యం చేసుకోవాలని ఢిల్లీ హైకోర్టును మజ్దూర్ ఆవాస్ సంఘర్ష్ సమితి అభ్యర్థించింది. నాలుగు రోజుల్లోగా ఇండ్లను తొలగించి, కూల్చివేయాలన్న నోటీసు అన్యాయమని, రాజ్యాంగ విరుద్ధమని నిర్మల్ గోరనా అన్నారు. సంబంధిత చట్టంలో నిర్దేశించిన కసరత్తు జరగని వరకు, ఆ బస్తీలో ఎలాంటి కూల్చివేత కార్యకలాపాలు చేపట్టవద్దని అన్నారు.

స్థానికురాలు మంజు దేవి మాట్లాడుతూ.. "భారత్‌లో జరగనున్న జి20 సదస్సు కారణంగా సరైన పునరావాసం, ప్రత్యామ్నాయ సహాయక చర్యలు చేపట్టకుండానే ప్రభుత్వ యంత్రాంగం బలవంతంగా తొలగింపులు, కూల్చివేతలు చేస్తున్నది. వారితో అశాంతి, భయం నెలకొన్నది. మురికివాడల నివాసితులు నిరాశ్రయులుగా మారుతారు" అని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణ అనే మరో నివాసి మాట్లాడుతూ.. " గత 40 ఏండ్లుగా బస్తీలో నివాసం ఉంటున్నాం. ఇండ్లు కూలితే పిల్లలు చదువులు మానుకోవాల్సి వస్తుంది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులను అధికారులు పట్టించుకోవడం లేదు" అని అన్నారు.

జకోవిచ్‌కు షాక్

● క్వార్టర్‌ఫైనల్లో హోల్గర్ చేతిలో ఓటమి

రోమ్: రోమ్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ క్వార్టర్‌ఫైనల్ టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్ అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. గురువారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ పోటీలో జకోవిచ్ 2-6, 6-4, 2-6తేడాతో డెన్మార్క్‌కు చెందిన హోల్గర్ రునె చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. వర్షం ఆటంకం కలిగించిన కీలక పోరులో 20 ఏళ్ల కుర్రాడి చేతిలో జకోవిచ్ ఓటమిపాలవ్వడం గమనార్హం. ఇంతకుముందు మాస్టర్స్ 1000 టోర్నీలోనూ (గతేడాది నవంబర్‌లో) జకోను రునె ఓడించి చరిత్ర సృష్టించాడు. ఇప్పుడు మరోసారి ఇటాలియన్ ఓపెన్‌లోనూ ఓడించి పైచేయి సాధించడం విశేషం. దీంతో తొలిసారి జకోవిచ్, నాదల్ వంటి టాప్ ఆటగాళ్లు లేకుండా ఫైనల్‌లో కొత్త ఆటగాళ్లు తలపడే అవకాశం ఉంది. గత కొన్ని వారాలుగా మోచేతి నొప్పితో బాధపడుతున్న జకోవిచ్ ఈ టోర్నీలోనూ అలాగే బరిలోకి దిగాడు. పెయిన్ కిల్లర్స్ వాడుతూ మ్యాచ్‌లను ఆడాడు. జకోవిచ్ వరుసగా 17వ సారి ఇటాలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. అయితే, హెూల్గర్ రునె మాత్రం అద్భుతమైన ఆటతీరుతో జకోవిచ్‌ను చిత్తుచేశాడు.

ఫ్రెంచ్ ఓపెన్ నుంచి వైదొలిగిన రఫెల్ నాదల్

మాడ్రిడ్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ వైదొలిగాడు. మల్లోర్కా అకాడమీలో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నాదల్ ఈ విషయాన్ని వెల్లడించాడు. తాను ఎంతో ఇష్టపడి ఆడే గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఒకటైన ఫ్రెంచ్ ఓపెన్ బరిలోకి దిగాలని భావించినా.. గాయంనుంచి పూర్తిగా కోలుకోని కారణంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపాడు. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను రఫెల్ నాదల్ రికార్డుస్థాయిలో 14సార్లు చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. 2005లో తొలిసారి ఈ టోర్నీని ముద్దాడిన నాదల్.. 37వారాలుగా గాయాల కారణంగా ఆటకు దూరంగా ఉంటున్నాడు. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ రెండోరౌండ్‌లో అమెరికాకు చెందిన మెకన్సీ మెక్ డొనాల్డ్ చేతిలో ఓటమిపాలయ్యాక మళ్లీ రాకెట్ పట్టలేదు.

21న అఖిల భారత ఆదివాసీ జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

గిరిజనులపై పెరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులతో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.రామ్మోహన్ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీల భూమిని, జీవనోపాధిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడం, విస్తాపనలేని అభివృద్ధిని, అడవులను రక్షించుకోవడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 21న డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, బీహార్, యుపి, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు సుమారు 750 మందికి పైగా పాల్గొంటారని తెలిపారు. ఆదివాసీ రచయిత, పాత్రికేయులు, జార్ఖండ్ మహిళా కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ కిరో, అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట రామయ్య, న్యాయవాది త్రినాథరావు, కేంద్ర ఇంధన శాఖ మాజీ సెక్రటరీ ఇఎఎస్ శర్మ తదితరులు సదస్సులో ప్రసంగిస్తారని చెప్పారు.

మత్తు ఇంజెక్షన్లు, గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం జిల్లా)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీతమ్మధార, పెందుర్తి, 2వ పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో భారీగా మత్తు ఇంజెక్షన్లు పట్టుబడ్డాయని నగర పోలీస్ కమిషనర్ సిఎమ్.త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతమ్మధార స్పెషల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్ పరిధిలో సీతమ్మధార, కనకపువీధి వద్ద ఈ నెల 17న ముందుగా సమాచారం వరకు తనిఖీలు నిర్వహించగా 3000 పెంటాజోసిన్ ఇంజెక్షన్లతో 60 బాక్సులను కలిగి ఉన్న గుంటు ఉమా మహేష్ (45)ను అరెస్టు చేశామని, నిందితుడు ఇప్పటికే రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. పిఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో ముందుగా అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా 2 బాక్స్‌ల్లో 100 పెంటాజోసిన్ ఇంజెక్షన్లు లభించాయని, ఈ కేసులో మధురవాడకు చెందిన భీమవరం వెంకటేష్ (35)ను అరెస్టు చేశామని తెలిపారు. ఈయనపై మహారాణిపేట, గోపాలపట్నం పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు ఉన్నాయని, ప్రస్తుతం బెయిల్‌పై వచ్చి ఉన్నాడని పేర్కొన్నారు. ఈ ఇంజక్షన్లు ఉపయోగిస్తున్న 14 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు.

రైతు కుటుంబాలకు పరిహారం అందించాలి

● లేనిపక్షంలో ఆందోళన ఉధృతం
● భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ స్పష్టం
● పాలకోడేరు జగనన్న లేఔట్ భూనిర్వాసితులతో పాదయాత్ర

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన నిరుపేద కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ స్పష్టం చేసింది. మాది పేదల ప్రభుత్వమని ప్రగల్భాలు పలుకుతున్న వైసిపి రైతుల నోట్లో మట్టి కొట్టేలా వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించింది. నష్టపరిహారం అందించకుండా రైతు కుటుంబాలను చిన్నాభిన్నం చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసింది. పాలకోడేరు కోటిగట్టు జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన నిరుపేద రైతు కుటుంబాలకు పరిహారం అందించాలని కోరుతూ భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాదయాత్ర చేపట్టారు. పాలకోడేరు-కుముదవల్లి రోడ్డు నుంచి చేపట్టిన ఈ పాదయాత్రను సీనియర్ రైతు గొట్టుముక్కల సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఈ యాత్రలో సిపిఎం, జనసేన, టిడిపితోపాటు వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, కెవిపిఎస్ నేతలు, నాయకులు, గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొని పాలకోడేరు రావిచెట్టు సెంటర్ మీదుగా పురానాదిమ్మ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. పాదయాత్రలో బాధిత కుటుంబ సభ్యులు, చిన్నారులు ఫ్ల కార్డులు పట్టుకుని బైఠాయించి నిరసన తెలిపారు. నష్టపరిహారం తక్షణం అందించాలని, లేక భూములు తిరిగివ్వాలని, ప్రభుత్వం, అధికారులు మోసం చేశారని, న్యాయం చేయకపోతే చూస్తూ ఊరుకోబోమని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే నిరుపేదల దగ్గర నుంచి భూములు తీసుకుని నష్టపరిహారం అందించకపోవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పేద రైతుల ఆధీనంలో ఉన్న భూములకు ఎకరాకు రూ.66 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పి మోసగించడం దారుణమన్నారు. జిల్లాలో అనేకచోట్ల భూస్వాముల చేతుల్లో వేలాది ఎకరాలు అసైన్డ్ భూములున్నాయని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే వారి నుంచి ఆ భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు.

24న సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్ (తూర్పు గోదావరి జిల్లా)

ఈ నెల 24న కొవ్వూరులో సిఎం జగన్ పర్యటించనున్నారు. 'జగనన్న విద్యా దీవెన' రాష్ట్ర స్థాయి వేడుకలు ఇక్కడ నిర్వహించనున్నట్లు హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. సోమవారం కొవ్వూరులో సిఎం పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ సిఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రదేశాలను పరిశీలించామన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశామని ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త, ఎంఎల్‌సి తలశిల రఘురాం తెలిపారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ సిఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమన్వయంతో సిఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు, వాహనాల మళ్లింపు, పార్కింగ్ తదితర వివరాలను ఎస్‌పి సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జెసి ఎన్.తేజ్‌భరత్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, ఇతర జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ నిమ్మల ఆందోళన

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమ గోదావరి జిల్లా)

అప్రకటిత కరెంటు కోతలకు నిరసనగా పాలకొల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు లాంతరు పట్టుకుని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కరెంటు కోతలు, ఛార్జీల భారం లేదని చెప్పారు. ప్రస్తుతం కరెంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలియడం లేదన్నారు. ఇంట్లో పడుకుంటే ఉక్కపోత, బయట పడుకుంటే దోమల మోతగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన చార్జీలు, సర్దుబాటు ఛార్జీలు అంటూ వినియోగదారుడిపై భారం మోపడం తప్ప నాణ్యమైన కరెంటు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం ఇదని అన్నారు. రూ.29 వేల కోట్లు కుంభకోణంతో రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్ల కుంభకోణానికి శ్రీకారం చుట్టడంతోపాటు భవిష్యత్తులో ముందుగానే అడ్వాన్స్‌గా కరెంట్ బిల్లులు కట్టే పరిస్థితిని జగన్ ప్రభుత్వం తీసుకొస్తుందని జోస్యం చెప్పారు.

బ్రిజ్ భూషణ్‌కో హటావో.. రెజ్లింగ్‌కో బచావో...

దేశవ్యాప్తంగా రెజ్లర్ల నిరసనకు పెరుగుతున్న మద్దతు

భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే తొలగించాలంటూ రెజ్లర్లు చేస్తున్న ప్రధాన డిమాండ్‌పై కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ నాన్చివేత ధోరణిని ప్రదర్శిస్తోంది. మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ రెజ్లర్లు నాలుగు నెలలక్రితం తొలుత ఆందోళనకు దిగారు. దీంతో అప్రమత్తమైన మంత్రిత్వశాఖ మేరీకోమ్(బాక్సింగ్), యోగేశ్వర్ దత్(రెజ్లింగ్), డోలా బెనర్జీ(ఆర్చరీ), సహదేవ్ యాదవ్(ఐఓఏ ట్రెజరర్)లతో కూడిన ఓ కమిటీని నియమించింది. నెలరోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలూ జారీచేసింది. ఆ కమిటీ మంత్రిత్వశాఖకు ఏ రిపోర్టు ఇచ్చిందో గానీ, బ్రిజ్‌భూషణపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో రెజ్లర్లు మళ్లీ జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరసనలకు దిగి.. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని వారు నిర్ణయించారు.



భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షులు, ... బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌ను తొలగించాలంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరసనలు చేస్తున్న రెజ్లర్లకు దేశవ్యాప్తంగా మద్దతు పెరుగుతోంది. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్‌తో పాటు, సిపిఎం కేంద్రకమిటీ సభ్యురాలు బృందాకరత్, భారతీయ కిసాన్ సంఘ్(బీకేయూ) నేత రాకేశ్ తికాయత్, ఖాప్ మహమ్ 24 నేత మెహర్ సింగ్, సంయుక్త కిసాన్ మోర్చాకు చెందిన దేవ్ సింగ్ సిర్సా తదితరులు వచ్చి సంఘీభావం తెలిపారు. అలాగే ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు రాకతో ప్రభుత్వం ఆఘమేఘాలమీద ఆ పరిసర ప్రాంతాన్ని తమ గుప్పిట్లోకి తీసుకొని భారీగా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్)ను మోహరించింది. ఆందోళన చేస్తున్న ప్రదేశంలో నీరు, కరెంటు, పారిశుధ్య, ఇతర సౌకర్యాలను తొలగిస్తూ రెజ్లర్లపై కక్షపూరిత ధోరణికి పాల్పడుతోంది. పోలీసులు అర్ధరాత్రి నిరసన శిబిరానికి చేరుకొని రెజ్లర్లను, వారికి మద్దతు తెలుపున్న వారందరినీ విచక్షణా రహితంగా కొడుతూ, టెంట్‌లను పీకేసి, అక్కడ ఉన్న వారందరినీ ఈడ్చి పడేశారు. దీంతో మహిళా రెజ్లర్లు కన్నీరు మున్నీరుగా విలపించడంతో దేశవ్యాప్తంగా వీరికి ప్రజా మద్దతు పెరిగింది. రెజ్లర్లు మే 11న బ్లాక్ డే నిర్వహించగా.. తాజాగా ఐఓఏ.. భారత రెజ్లింగ్ సంఘం(డబ్ల్యుఎఫ్) కార్యక్రమాలను అడ్‌హక్ కమిటీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీచేసింది. మరోవైపు రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై 21లోగా చర్యలు తీసుకోని పక్షంలో తమ నిరసనపై ఓ నిర్ణయం తీసుకుంటామని తాజాగా వెల్లడించారు.

వెనక్కి తగ్గిన పిటి ఉష...

బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా నిరసనకు దిగిన రెజ్లర్ల పట్ల తొలుత కఠినంగా మాట్లాడిన భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) అధ్యక్షురాలు పిటి ఉష ఆ తర్వాత వెనక్కి తగ్గారు. జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న రెజ్లర్లను కలుసుకొని పరామర్శించారు. అంతకుముందు ఐఓఏను సంప్రదించకుండా ఇలా ఏకపక్షంగా వీధుల్లోకి వచ్చి ఎలా నిరసనలకు దిగుతారు, ఇది దేశ ప్రతిష్టను దిగజార్చడమేనంటూ వ్యాఖ్యానించడంతో పిటి ఉషపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు పెద్దఎత్తున వెల్లువెత్తడంతో ఆమె వెనక్కి తగ్గి ప్రస్తుతం రెజ్లర్ల పక్షాన నిలిచారు.

సుప్రీంకోర్టులో విచారణ..

ఈ సమస్యపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో వేగం పెరిగింది. బ్రిజ్‌భూషణపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు ఫిర్యాదుదారులకు పోలీసులు భద్రత కల్పించాలని సుప్రీం ఆదేశాలు జారీచేసింది. అలాగే దర్యాప్తును విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షించాలని పేర్కొంది. ఏడుగురు మహిళా రెజ్లర్లు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. సుప్రీం జోక్యంతో ఫిబ్రవరి 28న బ్రిజ్ భూషణ్‌పై తొలిసారి ఎఫ్ఐఆర్ కేసు నమోదైంది. ఇది తమ తొలి విజయం అని రెజ్లర్లు ఆ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఏప్రిల్ 28న ఢిల్లీ పోలీసులు మరో రెండు కేసులను బ్రిజ్‌భూషణపై నమోదు చేశారు.

యుడబ్ల్యుడబ్ల్యు ఆందోళన

భారత్‌లో పరిణామాల పట్ల యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యుడబ్ల్యుడబ్ల్యు) ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో రెజ్లింగ్‌ను ఎవరు నడిపిస్తున్నారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు డబ్ల్యుఎఫ్ఐకి యుడబ్ల్యుడబ్ల్యు అధ్యక్షుడు నెనాద్ లాలోవిక్ లేఖ రాసారు. యుడబ్ల్యుడబ్ల్యు టోర్నీల్లో ఖచ్చితంగా ఎవరు పాల్గొంటారో.. డబ్ల్యుఎఫ్ఐ రోజువారీ కార్యకలాపాలు ఎవరు చూస్తారో... స్పష్టత లేదని, బ్రిజ్ భూషణ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై దర్యాప్తు నివేదిక ఏప్రిల్‌లోనే క్రీడా మంత్రిత్వశాఖకు అందినట్లు తెలుస్తోందని వెల్లడించింది.

- ప్రజాశక్తి స్పోర్ట్స్ కరస్పాండెంట్

రెజ్లిగ్ ఫెడరేషన్ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు మాఫియాతోనూ సంబంధాలున్నట్లు సమాచారం. రెజ్లర్లకు రైతు సంఘాల నాయకులు మద్దతు తెలపడంపై ఆయన ఇటీవల ఓ వీడియోను పోస్ట్ చేశారు. మాట మాత్రం చెప్పకుండా వారు రెజ్లర్లకు ఎలా మద్దతు తెలుపుతారంటూ పేర్కొన్నాడు. అలాగే ఢిల్లీ పోలీసులు కూడా దర్యాప్తు పూర్తయ్యేదాకా వేచి చూడాలని కోరారు. తనపై ఒక్క ఆరోపణ రుజువైనా 'ఉరి వేసుకుంటానని, శిక్ష విధించి, కొట్టి చంపండి' అని వెల్లడించాడు.

నిరవధిక ఆందోళన చేస్తున్న వినేశ్, సంగీత పోగాట్, సాక్షి, బజ్‌రంగ్ మాట్లాడుతూ.. నాలుగు నెల క్రితం ఆందోళన చేపట్టడానికి ముందు తామంతా ఓ అధికారిని కలిసామని, మహిళా అథ్లెట్లను బ్రిజ్ భూషణ్ శారీరకంగా, మానసికంగా ఎలా వేధింపులకు గురిచేస్తున్నారో వివరించామన్నారు. ఆ సందర్భంగా వారు ఓ కమిటీ వేస్తామని, అతనిపై తప్పక చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతోనే అప్పట్లో నిరసనను విరమించామని పేర్కొన్నారు. ఇన్నాళ్లయినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మళ్లీ ఆందోళనకు దిగాల్సి వచ్చిందని వారు తెలిపారు. నిరవధిక ఆందోళనలు చేస్తున్న రెజ్లర్లలో సాక్షి మాలిక్ 2016 రియో ఒలింపిక్స్, బజ్‌రంగ్ పునియా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలను సాధించగా.. వినేశ్, సంగీత పోగాట్ 2022, 2019 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన స్టార్ రెజ్లర్లు.

రెజ్లర్ల పోరాటానికి వెల్లువెత్తుతున్న మద్దతు

- జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళన
- రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళి
- దేశవ్యాప్తంగా సంఘీభావ ప్రదర్శనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసితీరాలంటూ ప్రఖ్యాత రెజ్లర్లు చేపట్టిన ఆందోళనకు సర్వత్రా మద్దతు వెల్లువెత్తుతోంది. దేశవ్యాప్తంగా సంఘీభావ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మహిళా, యువ, విద్యార్థి సంఘాలు, బిజెపియేతర రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు ఎక్కడికక్కడ ర్యాలీలు చేపట్టి బిజెపి తీరును ఎండగడుతున్నాయి. బేటీ బచావో అంటే ఇదేనా అంటూ నిలదీస్తున్నాయి. జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్ల ఆందోళన గురువారంతో 26వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాజ్ ఘాట్‌లోని మహాత్మా గాంధీ సమాధి వద్ద రెజ్లర్లు నివాళులర్పించారు. భారత ఒలింపిక్ అసోసియేషన్ అథ్లెట్స్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్, భారత స్టార్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ జంతర్ మంతర్ వద్దకు విచ్చేసి రెజ్లర్లకు మద్దతు ప్రకటించారు. 'అథ్లెట్లు నిజంగా కఠినమైన సమయాన్ని ఎదుర్కొంటున్నారు. ఫెడరేషన్‌పై ఈ పోరాటం కారణంగా, వారు తమ కెరీర్ మొత్తాన్ని పణంగా పెట్టారు" అని శరత్ కమల్ అన్నారు. అథ్లెట్స్ కమీషన్ వైస్ చైర్‌పర్సన్ గా, క్రీడాకారులుగా తామంతా రెజ్లర్లకు సంఘీభావంగా నిలుస్తామన్నారు. న్యాయం జరుగుతుందన్న విశ్వాసం తనకుందన్నారు.



దేశవ్యాప్తంగా ప్రజా సంఘాల ఆందోళన

రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా ఆరు ప్రజా సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగిస్తున్నాయి. సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు సంయుక్తంగా గురువారం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆందోళన జరిగింది. నిరసన వేదిక జంతర్ మంతర్ వద్ద నేతలతో పాటు రెజ్లర్లు కూడా చేరారు. ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శులు వి సిదావాసన్ (ఎంపి), విక్రమ్ సింగ్, ఐద్వా ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి మైమూనా మొల్లా, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను, సహాయ కార్యదర్శి ఆదర్శ్ ఎం సాజి తదితరులు పాల్గొన్నారు. గుజరాత్‌లోని హిమాంద్‌నగర్‌లో కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. దాహోద్ జిల్లాలో ప్రదర్శన చేపట్టిన కిసాన్ సభ కార్యకర్తలు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, త్రిపుర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఉమ్మడి ప్రదర్శనలు, ధర్నాలు, బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మ దహనాలు జరిగాయి.

రెజ్లర్ల ఆందోళనకు సంఘీభావంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఆందోళనలు జరిగింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కలకత్తాలో ఎస్ కెఎం భారీ నిరసన ర్యాలీ చేపట్టింది. మహిళలు, క్రీడాకారులు, కార్మికులు, పౌరులు, యువకులు, విద్యార్థుల సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీలో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, ఆయన మద్దతుదారు, బిజెపి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అస్సాంలో కూడా నిరసనలు జరిగాయి.

కేంద్ర మంత్రికి ఇ-మెయిల్ ద్వారా డిమాండ్ : ఎస్ఎఫ్ఐ

లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రికి మే 20న ఈ-మెయిల్, పోస్టు కార్డులు పంపాలని దేశ ప్రజలకు ఎస్ఎఫ్ఐ పిలుపు ఇచ్చింది.

ఆడబిడ్డల ఆర్తనాదాలు వినపడటం లేదా ? : సూర్జేవాలా

జంతర్ మంతర్ వద్ద రెజ్లర్ల నిరసన ప్రాంగణాన్ని సందర్శించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా మద్దతు తెలిపారు. రెజ్లర్ల డిమాండ్‌లకు సంఘీభావం తెలుపుతూ వారితో సమావేశమయ్యారు. దేశంలోని ఆడబిడ్డల ఆర్తనాదాలు, న్యాయం కోసం వారు చేస్తున్న విజ్ఞప్తులను మోడీ ప్రభుత్వం ఎందుకు వినడం లేదని సూర్జేవాలా ప్రశ్నించారు. "పతకాలు సాధించి తిరిగొచ్చిన కూతుళ్లు అప్పుడు మీ కుటుంబ సభ్యులే.. వేల మైళ్ల దూరంలో ఉన్న వాళ్లకు వీడియో కాల్స్ చేస్తూ దేశం మొత్తం మీద మీ ప్రతిష్టను పెంచుకోవడంలో మీరు వెనుకడుగు వేయలేదన్నది ప్రధానికి నా సూటి ప్రశ్న" అని అన్నారు. "మోడీ, మీరు దేశమంతటా మహిళా సాధికారత, బేటీ పడావో-బేటీ బచావో నినాదాన్ని ఇస్తున్నారు. మీ నినాదం వాస్తవికత 26 రోజులు జంతర్ మంతర్ వద్ద కనిపిస్తుంది" అని పేర్కొన్నారు.

మోడీ మౌనం వీడాలి : జైరాం రమేశ్

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. పతకాలు సాధించి దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చిన క్రీడాకారులు తమకు న్యాయం చేయాలని నాలుగు నెలలకు పైగా డిమాండ్ చేస్తున్నారని, అయితే తమ ఎంపిని కాపాడేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ అంశంపై ప్రధాని మోడీ మౌనం వీడాలని కోరారు.

అంబాలా బిజెపి ఎంపి మృతి



చండీగఢ్ : కేంద్ర మాజీ మంత్రి, బిజెపికి చెందిన అంబాలా పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు రత్తన్ లాల్ కటారియా గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. 71 ఏళ్ల కటారియా గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కటారియా మరణంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఇతర బిజెపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా సేవ, సామాజిక న్యాయం కోసం కటారియా గొప్ప కృషి చేశారని తెలిపారు. న్యూమెనియో, ఇతర ఆరోగ్య సమస్యలతో చండీగఢ్‌లో ఆసుపత్రిలో కొన్ని రోజుల క్రితం కటారియా చేరారు. బుధవారం ఆయన ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో గురువారం ఉదయం 3.30 గంటల సమయంలో మరణించారు. మధ్యాహ్నం ఇక్కడి మణిమజ్రాలో కటారియా అంత్యక్రియలు నిర్వహించారు. కటారియాకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 1999, 2014, 2019 ఎన్నికల్లో అంబాల నుంచి లోక్‌సభకు కటారియా ఎన్నికయ్యారు. 2019 నుంచి 2021 జులై వరకూ కేంద్ర జల శక్తి, సామాజిక న్యాయం, సాధికారత శాఖ ఉప మంత్రిగా కటారియా పని చేశారు. హర్యానా బిజెపి అధ్యక్షులుగానూ, హర్యానా మంత్రిగానూ కటారియా పని చేశారు.

కుల గణన సర్వేపై నిషేధం రద్దుకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ : బీహార్ ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వేను నిలుపు చేస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. సర్వేను నిషేధిస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీహార్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌ను విచారించింది. హైకోర్టు తీర్పును రద్దు చేయడానికి నిరాకరించింది. బీహార్‌లో తొలి దశ కుల గణన ఈ ఏడాది జనవరి 7 నుంచి 21 వరకూ జరిగింది. రెండో దశ ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకూ జరగాల్సి ఉంది. అయితే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో సర్వే ఆగిపోయింది.

ఆర్థిక మాంద్యం ముంగిట జర్మనీ ?

బెర్లిన్ : జర్మనీలో అభివృద్ధి అవకాశాలు మరింత అధ్వాన్నంగా మారడంతో పెట్టుబడిదారుల విశ్వాసం వరుసగా మూడో నెల కూడా క్షీణించింది. దీంతో ఇయులోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన జర్మనీలో మాంద్యం నెలకొనగలదన్న భయాలకు ఆజ్యం పోసినట్లైందని బ్లూమ్‌బెర్గ్ తన అధ్యయనంలో వెల్లడించింది. జ్యూ ఆర్థిక పరిశోధనా సంస్థ లెక్కించిన ఆర్థిక మనోభావాల సూచీ ఏప్రిల్‌లో 4.1గా వుండగా, మేలో మైనస్ 10.7కి పడిపోయిందని అధ్యయనం పేర్కొంది. మైనస్‌ల్లోకి జారిపోవడం ఇదే మొదటిసారి. అంటే ప్రస్తుత పరిస్థితులు కూడా మరింత క్షీణించాయని తెలుస్తోందని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. జర్మనీలోని పలు పరిశ్రమల్లో ఊహించిన దానికన్నా ఎక్కువగా ఉత్పత్తిలో మాంద్యం నెలకొంది. తయారీ కంపెనీలకు వచ్చే ఆర్డర్లు మార్చితో పోల్చుకుంటే ఏప్రిల్‌లో 10.7శాతం పడిపోయాయి. 2020 ఏప్రిల్ తర్వాత ఇంతలా క్షీణించడం ఇదే. ఈ నేపథ్యంలోనే డేటా వివరాలు బయటకు వచ్చాయి. వచ్చే ఆరు మాసాల్లో పరిస్థితి మరింత క్షీణించవచ్చని భావిస్తున్నట్లు ఆర్థిక రంగ మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారని జ్యూ అధ్యక్షుడు అచిమ్ వాంబక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితంగా జర్మనీ మాంద్యంలోకి జారుకునే ప్రమాదం వుందన్నారు.

వారణాసిలో రైతులపై విరిగిన లాఠీ

- మోడీ ఇలాకాలో భూ సర్వేకు ప్రతిఘటన
- ఘర్షణలో పలువురికి గాయాలు

రైతు గళమెత్తితే మోడీ ప్రభుత్వం గొంతునొక్కుతోంది. తమ భూములు కోల్పోతామనే ఆందోళన చేస్తున్న అన్నదాతలపై ఖాకీలు జులుం ప్రదర్శించాయి. ట్రాన్స్‌పోర్ట్ నగర్ ప్రాజెక్టు కోసం సర్వే చేయటానికి వచ్చిన అధికారులను అడ్డుకోవటంతో పోలీసులు రెచ్చిపోయారు. లాఠీలతో విరుచుకుపడ్డారు. మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో రైతులపై పోలీసులు దూకుడుగా వ్యవహరించిన తీరుపై రైతు సంఘాలు మండిపడుతున్నాయి.



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి లోక్‌సభ స్థానంలో ట్రాన్స్‌పోర్ట్ నగర్ ప్రాజెక్ట్ కోసం భూమిని సర్వే చేసేందుకు వచ్చిన వారణాసి అభివృద్ధి సంస్థ (వీడీఏ) అధికారులను స్థానికులు ప్రతిఘటించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలలో పలువురు గాయపడ్డారు. భూ సర్వేకు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. తీవ్ర ప్రతిఘటన ఎదురు కావడంతో పోలీసులు బల ప్రయోగానికి సిద్ధపడ్డారు. బుల్‌డోజర్లతో రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా ఘర్షణలు చెలరేగి పలువురు గాయాల పాలయ్యారు.

రైతులకు చెందిన భూములలో సర్వే జరిపేందుకు వీడీఏ, రెవెన్యూ అధికారులు మంగళవారం పోలీసులను వెంటపెట్టుకొని మోహన్ సరాయ్ ప్రాంతంలోని కర్నాదాది, బైర్వాన్ వద్దకు చేరుకున్నారు. అయితే తమ భూములను అప్పగించేందుకు రైతులు ససేమిరా అన్నారు. 2013 సంవత్సరపు భూ సేకరణ చట్టాన్ని అధికారులు ఉల్లంఘిస్తున్నారంటూ మండిపడ్డారు. అందిన సమాచారం ప్రకారం ఘర్షణకు దిగిన అధికారులు, పోలీసులపై స్థానికులు రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు లాఠీఛార్జి చేసి, భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. పోలీసులు తమ ఇళ్లలోకి ప్రవేశించి మహిళలు, పిల్లలను విచక్షణారహితంగా కొట్టారని రైతులు వాపోయారు. ఈ ఘర్షణలో మహిళలు, రైతులు సహా పలువురు గాయపడ్డారు.

ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసుల సమక్షంలో భూ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని అడిషనల్ డిప్యూటీ కమిషనర్ (పోలీస్) మనీష్ శాండిల్య చెప్పారు. అల్లరిమూకలు రాళ్లు రువ్వగా తాము స్వల్పంగా లాఠీఛార్జి చేశామని తెలిపారు.

ప్రతిపాదిత ట్రాన్స్‌పోర్ట్ నగర్ కోసం భూమిని సర్వే చేయాలన్న ప్రతిపాదనను 2001లోనే ఖరారు చేశారు. మోహన్‌సరాయ్, కర్నాదాది సహా నాలుగు గ్రామాలకు చెందిన 82 హెక్టార్ల భూమిని సేకరించాలని ప్రతిపాదించారు. అయితే నష్టపరిహారం ఇచ్చిన భూమినే సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు. తమలో చాలా మందికి నష్టపరిహారం అందలేదని వారు తెలిపారు. గతంలో సర్వే చేసిన భూమికే ఇప్పటి వరకూ నష్టపరిహారం ఇవ్వలేదని, ఇప్పుడు మళ్లీ కొత్తగా భూమిని సర్వే చేస్తున్నారని చెప్పారు. నష్టపరిహారం అందనిదే భూమిని ఎలా ఇస్తామని ప్రశ్నించారు. ఈ నియంతృత్వ వైఖరిని సహించబోమని స్పష్టం చేశారు.

ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పికె గుప్తా

- నియామకానికి కేంద్రం అనుమతి కోరిన ఢిల్లీ

న్యూఢిల్లీ : ఢిల్లీ నూతన ప్రధాన కార్యదర్శిగా పికె గుప్తాను నియమించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిని కేజ్రీవాల్ ప్రభుత్వం కోరింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గురువారం వెల్లడించారు. 1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి పికె గుప్తా ప్రస్తుతం సాధారణ పరిపాలన విభాగం (జిఎడి)లో అదనపు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న నరేష్ కుమార్ ఈ ఏడాదిలో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో పికె గుప్తాను ఆ పదవీలో నియమించడానికి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రతిపాదించారు. అధికారుల బదిలీ, పోస్టింగ్‌లతో సహా సేవల విషయంలో ఢిల్లీ ప్రభుత్వానికే పూర్తి కార్యనిర్వహక అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని రోజుల్లే కేజ్రీవాల్ ఈ ప్రతిపాదన చేయడం గమనార్హం.

స్పందన తెలియజేయండి

- ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ పోలీసులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : 2020 ఫిబ్రవరిలో దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన అల్లర్ల వెనుక పెద్ద కుట్ర ఉన్నదని ఆరోపించిన కేసులో.. కార్యకర్త ఉమర్ ఖలీద్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ మేరకు ఢిల్లీ పోలీసుల స్పందనను కోరింది. గతేడాది అక్టోబర్‌లో ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు తనకు బెయిల్ నిరాకరించడంతో ఖలీద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) మద్దతుదారులు, దానిని వ్యతిరేకించే వారి మధ్య ఈశాన్య ఢిల్లీలో జరిగిన ఘర్షణలకు సంబంధించినది. 2020 ఫిబ్రవరి 23 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరిగిన ఈ హింసాత్మక ఘటనలో 53 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది ముస్లింలే కావటం గమనార్హం. ముఖ్యంగా ఈ అలర్లలలో బీజేపీ, దాని అనుబంధ సంఘాలు రెచ్చిపోయి దాడులకు దిగాయి. సీఏఏను వ్యతిరేకించే వారి లక్ష్యంగా తమ దాడులను కొనసాగించాయి. ఇటు కేంద్రం ఆదేశాలతో ఢిల్లీ పోలీసులు కూడా సీఏఏ వ్యతిరేకించే వారినే టార్గెట్ చేశారని ప్రత్యక్ష సాక్షులు గుర్తు చేశారు. అదే ఏడాది సెప్టెంబరులో ఈ కుట్ర ఆరోపణల ఆధారంగా ఖలీద్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాల (నివారణ) చట్టం, ఆయుధ చట్టం, ఆస్తి నష్టం నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం అతనిపై కేసు నమోదు చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ కేసులో ఢిల్లీ పోలీసుల ప్రతిస్పందనను కోరింది. సుప్రీంకోర్టు వేసవి సెలవుల తర్వాత ఈ విషయాన్ని విచారణకు వాయిదా వేసింది. అత్యవసర విచారణ కోసం వెకేషన్ బెంచ్‌కు తరలించేందుకు ఖలీద్‌ను కోర్టు అనుమతించింది. అయితే వేసవి సెలవుల తర్వాత ఈ అంశాన్ని విచారించవచ్చని ఆయన తరపు వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపినట్టు సమాచారం. సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు మే 22 నుంచి ప్రారంభమై జూలై 2తో ముగుస్తాయి.

నిరసనల మధ్య హిరోషిమా చేరుకున్న బైడెన్

- జపాన్ ప్రధాని కిషిదాతో భేటీ

హిరోషిమా : జి 7దేశాల సమావేశానికి ముందుగా జపాన్, అమెరికా నేతలు గురువారం ఇక్కడ సమావేశమయ్యారు. నిరసనలు, ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రస్తుతం జి 7కి అధ్యక్ష బాధ్యతలు వహిస్తున్న జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా శుక్రవారం నుండి ప్రారంభం కానున్న జి 7 శిఖరాగ్ర సదస్సుకు ఆతిథ్యమిస్తున్నారు. ఈ సమావేశాలు మూడు రోజుల పాటు సాగనున్నాయి. కాగా ఈ సమావేశాలను నిరసిస్తూ హిరోషిమాలో తీవ్ర స్థాయిలో నిరసనలు జరుగుతున్నాయి. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హిరోషిమా శాంతి స్మారక చిహ్నం దగ్గర వందలాదిమంది ఆందోళనకారులు గుమిగూడారు. అయితే నిరసనల కారణంగా వచ్చే సోమవారం సమావేశాలు ముగిసే వరకు దీన్ని మూసివేస్తున్నారు. సదస్సును నిరసిస్తూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. వీరిలో యూనివర్శిటీ విద్యార్థులు, అణు దాడి బాధితుల కుటుంబ సభ్యులు అందరూ వున్నారు.



ఆందోళనకారులకు పదిరెట్లు పోలీసులు రంగంలోకి దూకి పరిస్థితులను కట్టడి చేయడానికి ప్రయత్నించారు. తూర్పు ఆసియాలో ఇరు దేశాల మధ్య సైనిక కూటమిని అభివృద్ధిపరచడానికి దారి తీసేలా గురువారం జపాన్, అమెరికా దేశాల నేతలు చర్చలు జరిపారు. సామాన్యుల ఆలోచనలు, ఆశయాలను కచ్చితంగా ఈ సమావేశం విస్మరిస్తుందని కాలేజీ విద్యార్థి ఒకరు వ్యాఖ్యానించారు.

జల్లికట్టుకు సుప్రీం పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. 1960 నాటి జంతు హింస నివారణ చట్టాన్ని ఉల్లంఘించేలా ఈ చట్టం ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. దీని వల్ల జంతువులు, మనుషులు గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని, హింసతో కూడిన ఈ ఆటను నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గతేడాది విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం.. జల్లికట్టులో హింస ఉంటుందని, అంత మాత్రానా దాన్ని నెత్తుటి క్రీడ అనలేమని పేర్కొంది. అనంతరం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా సర్వోన్నత న్యాయస్థానం దీనిపై తీర్పు వెలువరించింది. జల్లికట్టుపై తమిళనాడు చేసిన చట్టాన్ని రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. "గత శతాబ్ద కాలంగా తమిళనాడులో జల్లికట్టును నిర్వహిస్తున్నారు. ఇది ఆ రాష్ట్ర సంస్కృతిలో భాగమా? కాదా? అన్నదానిపై సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోదు. అది తమ వారసత్వ సంస్కృతిలో భాగమని శాసనసభ నిర్ణయించినప్పుడు.. న్యాయవ్యవస్థ దాన్ని భిన్నకోణంలో చూడలేదు. దీనిపై శాసనసభ నిర్ణయం తీసుకోవడమే మంచిది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలోనూ ఇలాంటి క్రీడలను అనుమతిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలను కూడా సుప్రీంకోర్టు సమర్థించింది.

ఆహార ధాన్యాల ఒప్పందాన్ని పొడిగించిన రష్యా

స్వాగతించిన యుఎన్ చీఫ్



న్యూయార్క్ : నల్ల సముద్రం ఓడరేవుల నుండి ఉక్రెయిన్ గోధుమలను, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి అనుమతించే బ్లాక్ సీ గ్రెయిన్ ఒప్పందాన్ని పొడిగించాలని రష్యా నిర్ణయించింది. కాగా ఈ నిర్ణయాన్ని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ గురువారం స్వాగతించారు. మరో 60రోజుల పాటు ఈ ఒప్పందాన్ని పొడిగించాలని రష్యా సమాఖ్య తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొన్ని సానుకూలమైన, కీలకమైన పరిణామాలు సంభవించాయని అన్నారు. ఈ ఒప్పందం కొనసాగడం ప్రపంచదేశాలకు శుభవార్త అని అన్నారు. పరిష్కరించాల్సిన సమస్యలు ఇంకా చాలా వున్నాయి. అయితే, రష్యా, ఉక్రెయిన్, టర్కీ, ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు వాటిని చర్చిస్తునే వుండాలని న్యూయార్క్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. ఆహార ధాన్యాల ఎగుమతికి ఉద్దేశించిన ఈ చొరవ మరింత మెరుగవాలని, పొడిగించబడాలని, విస్తృతమవాలని ఆ దిశగా సమగ్ర ఒప్పందం కుదరాలని గుటెరస్ ఆశించారు. ఆ మూడు దేశాల ప్రతినిధులకు కూడాతాను ఇదే విషయాన్ని లేఖ రాశానన్నారు. ఇప్పటివరకు ఈ ఒప్పందం కింద 3కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను ఎగుమతిచేశారు. సూడాన్‌లో ఆకలితో అలమటిస్తున్న వారితోసహా పలు పేద దేశాలకు కీలకమైన ఈ ఆహార సరఫరాలు చేరుతున్నాయి.

చిన్నారుల మెదళ్లలో విద్వేషం నింపే యత్నం

- 'కేరళ స్టోరీ'కి మాస్ బుకింగ్స్
- ఢిల్లీ ప్రయివేటు స్కూళ్ల తీరుపై సిపిఎం ఆందోళన
- చర్యలు తీసుకోవాలని విద్యామంత్రికి లేఖ

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలోని కొన్ని సంఘ్ పరివార్ అనుకూల ప్రయివేటు స్కూళ్లు చిన్నారుల మెదళ్లల్లో విద్వేషం నింపేందుకు ప్రయత్నిస్తున్నాయి. దేశంలో 'లవ్ జిహాద్' అనేది లేదని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వమే ప్రకటించినా కూడా కేరళలో ఏదో జరిగిపోతోందంటూ తప్పుడు ఊహాజనిత కల్పిత కథాంశంతో తెరకెక్కించిన వివాదస్పద చిత్రం 'ద కేరళ స్టోరీ'ని బలవంతగా పాఠశాల విద్యార్థులకు చూపించేందుకు కొన్ని స్కూళ్లు మాస్ టిక్కెట్ బుకింగ్స్ చేశాయి. ఈ పరిణామాలపై లౌకిక వాదులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే జోక్యం చేసుకొని ప్రయివేటు స్కూళ్ల చర్యలను అడ్డుకోవాలని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కెఎం తివారి దేశ రాజధాని ప్రాంత (ఎన్‌సిటి) ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి కుమారి అతిషికి గురువారం నాడు లేఖ రాశారు. వివాదస్పద 'ద కేరళ స్టోరీ' చిత్రానికి టిక్కెట్లు కొనితీరాలంటూ కొన్ని ప్రయివేటు స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని, బలవంతమైన ఈ చర్యలను తక్షణమే నిలిపేయాలని కోరారు. కొన్ని ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు ఈ చలనచిత్ర ప్రదర్శన ముగిసిన అనంతరం మత విద్వేషాలు రెచ్చగొట్టేలా విద్యార్థుల చేత నినాదాలు చేయించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఇలాంటి నీచమైన చర్యలను తక్షణమే అడ్డుకొని దేశరాజధాని మత సామరస్యతను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువాన్లలో చెల్లింపులు జరిపిన చైనా

బీజింగ్ : యువాన్లలో చెల్లింపులు జరిపి విదేశాల నుండి కొనుగోలు చేసిన మొట్ట మొదటి సరుకు ఎల్ఎన్‌జి (ద్రవరూపంలోని సహజ వాయువు)ని చైనా అందుకుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన చైనా నేషనల్ ఆఫ్‌షోర్ ఆయిల్ కార్పొరేషన్ (సిఎన్ఒఒసి) ఈ విషయాన్ని మంగళవారం ప్రకటించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) నుండి 65వేల టన్ను ఎల్ఎన్‌జిని కొనుగోలు చేసినట్లు కంపెనీ తెలిపింది. అంతర్జాతీయ వేదికపై యువాన్ ఉనికి పెరుగుతోందనడానికి ఇదొక తాజా సంకేతమని కార్పొరేషన్ పేర్కొంది. చైనా కరెన్సీలోనే చమురు, గ్యాస్ వాణిజ్యం జరిగేందుకు గల పరిస్థితులు రాన్రాను మెరుగవుతున్నాయని పేర్కొంది. డాలర్లలో చెల్లింపులను పక్కన బెట్టే వ్యూహంలో భాగంగా డాలరు, యూరో కాకుండా ఇతర కరెన్సీల్లో చెల్లింపులను చైనా పెంపొందిస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు తీవ్రంగా ఆంక్షలు విధించడంతో చైనా ఈ చర్యలు ప్రారంభించింది. గతేడాదిలో రష్యా, చైనాల మధ్య సరుకుల రవాణా 88బిలియన్ల డాలర్లకు చేరింది. మాస్కో నుండి చైనా కొనుగోలు చేసే ముడిచమురు, గ్యాస్, బొగ్గు, కొన్ని రకాల లోహాలు ఇలా అన్నింటికీ యువాన్లలోనే చెల్లింపులు జరిపిందని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది.

ముంబయి పేలుళ్ల కేసులో సూత్రధారి రాణా అప్పగింత!

న్యూఢిల్లీ : ముంబయిపై తీవ్రవాదుల దాడి జరిగి సుమారు 15 ఏళ్ల గడిచిన తరువాత ఎట్టకేలకు ఈ కేసులో ఇద్దరు నిందితుల్ని భారత్‌కు అప్పగించడానికి అమెరికా కోర్టు అంగీకరించింది. పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా వ్యాపారవేత్త తహవ్వూర్ రాణాను, పాకిస్తాన్ సంతతికి చెందిన అమెరికాకు చెందిన ఉగ్రవాది డెవిడ్ కోలెమాన్ హెడ్లీ అలియాస్ డోడ్ గిలానీని భారత్‌కు అప్పగించడానికి కోర్టు అంగీకరించింది. 2008 నవంబర్ 26న ముంబయిలో వివిధ ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో 166 మంది మరణించారు. ఈ దాడుల్లో రాణా, గిలానీ భాగస్వామ్యం ఉందని, దాడులకు పథక రచన చేశారని భారత్ ఆరోపిస్తుంది. 2020 జూన్‌లో ఈ ఇద్దర్నీ అప్పగించాలని అమెరికాకు విజ్ఞప్తి చేసింది. దీంతో అమెరికా ఇద్దర్ని అరెస్టు చేసిన జైల్లో ఉంచింది.

'ద కేరళ స్టోరీ' కల్పితమే

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విధించిన నిషేధంపై కోర్టు స్టే విధించింది. అలాగే తమిళనాడులో ఈ చిత్రాన్ని ప్రదర్శించిన థియేటర్ల వద్ద భద్రత కల్పించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు 'ది కేరళ స్టోరీ' చిత్ర నిర్మాతలు, తమిళనాడులోని థియేటర్ల యజమానులు దాఖలు చేసిన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం గురువారం నాడు విచారణ చేపట్టింది. ఈ చిత్రంలో 'కేరళలో 32 వేల మంది మహిళలను ఇస్లాంలోకి మార్చారు' అంటూ పేర్కొన్నారని, ఇది పూర్తిగా వాస్తవాలను వక్రీకరించడమేనని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. ఇలంటి వక్రీకరణలపై 'మీరేం చేస్తున్నారు' అంటూ చిత్ర నిర్మాతల తరపున హాజరైన న్యాయవాది హరీష్ సాల్వేను జస్టిస్ చంద్రచూడ్ నిలదీశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను రక్షించేందుకు తామున్నామని, కానీ అదే పేరుతో సమాజంలో ద్వేషం రెచ్చకొట్టాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. మతమార్పిడులకు సంబంధించి ఎలాంటి ప్రామాణిక సంఖ్య లేదని న్యాయవాది సాల్వే కూడా అంగీకరించారు. 32 వేల మంది అనేది ప్రామాణిక సంఖ్య కాదని, ఈ విషయంలో ఖచ్చితమైన సమాచారం అందుబాటులో లేదని డిస్‌క్లెయిమర్‌లో పొందుపరుస్తామని సాల్వే కోర్టుకు తెలిపారు. సాల్వే సమాధానంపై తమిళనాడు ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది కపిల్ సిబాల్ తీవ్రంగా స్పందించారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) ప్రకారం సినిమా లేదా ఒక కళారూపం వాక్ స్వాతంత్ర్యంపై పరిమితులకు లోబడి ఉండాలి' అని తెలిపారు. తదుపరి విచారణను జులై 18కి కోర్టు వాయిదా వేసింది.

సిఎంగా సిద్ధు .. డిప్యూటీగా డికె

(మొదటి పేజీ తరువాయి)

పీల్చుకుంది. ఈ రాజీ ఫార్ములా ప్రకారం శివకుమార్ ఉపముఖ్యమంత్రి పదవితో పాటు 2024 సార్వత్రిక ఎన్నికల వరకూ పిసిసి చీఫ్‌గానూ కొనసాగుతారు. ఈ నిర్ణయాన్ని పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్ గురువారం ప్రకటించారు. కర్ణాటకలో పార్టీ విజయానికి అగ్రనాయకత్వంతో సహా నాయకులందరూ చాలా కష్టపడి పని చేశారని తెలిపారు. దీంతో కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

పదవీస్వీకార ఉత్సవానికి ప్రతిపక్ష నేతలు

ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ ఇతర మంత్రులతో కలిసి ఈ నెల 20న శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు పదవీస్వీకార ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గాంధీ కుటుంబం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సుఖ్వీందర్ సింగ్ సుక్కు (హిమాచల్), అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), భూపేశ్ భగేల్ (ఛత్తీస్‌గఢ్)తో పాటు బిజెపియేతర భావసారుప్యత కలిగిన ప్రతిపక్ష పార్టీల అధినేతలందరినీ ఆహ్వానించనున్నట్లు తెలిసింది. అగ్రశ్రేణి ప్రతిపక్ష నాయకులు సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూఖ్ అబ్దుల్లా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, మహారాష్ట్ర నుంచి శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తదితర నేతలకు ఆహ్వానించనున్నట్లు తెలిసింది.

పరమేశ్వరన్ 'ఉప' గళం

ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నించిన మరో సీనియర్ నాయకులు జి పరమేశ్వరన్ గురువారం కాస్త అసంతృప్త గళాన్ని వినిపించారు. ఉప ముఖ్యమంత్రి పదవిని దళితులకు ఇవ్వకపోతే పార్టీలో ప్రతికూల వాతావరణ ఏర్పడుతుందని, ఇది రాబోయే కాలంలో పార్టీకి పెను సమస్యగా పరిణమిస్తుందని కేంద్ర నాయకత్వాన్ని ఆయన హెచ్చరించారు. డికె శివకుమార్ ఏకైక ఉపముఖ్యమంత్రిగా ఉంటారని అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 71 ఏళ్ల పరమేశ్వరన్ దళిత నాయకుడు. హెచ్‌డి కుమారస్వామి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ - జెడిఎస్ కూటమి ప్రభుత్వంలో ఆయన ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. కర్ణాటక పిసిసి చీఫ్‌గా సుదీర్ఘకాలం (ఎనిమిదేళ్లు) పని చేసిన నేతగా కూడా పరమేశ్వరన్ గుర్తింపు పొందారు.

224 స్థానాలున్న కర్ణాటక శాసనసభకు ఈ నెల 10న ఎన్నికలు జరిగాయి. ఇదే నెల 13న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. అవినీతిలో కూరుకుపోయి మతతత్వ విద్వేష విధానాలతో తీవ్ర అప్రతిష్టపాలైన బిజెపి ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలవ్వగా.. 135 స్థానాల్లో కాంగ్రెస్ జయభేరీ మోగించింది. మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా కాంగ్రెస్ గూటికి చేరడంతో దాని సంఖ్యాబలం 137కు చేరింది. బిజెపి 66 స్థానాలకే పరిమితమైంది. జెడిఎస్ 19 స్థానాల్లో విజయం సాధించింది.



తల్లి మనసు



ఓ ఊరిలో రాజమ్మ, రాజయ్య ఉన్నారు. వీరికి రంగడు ఒక్కడే కొడుకు. రంగడు చిన్నతనంలోనే తండ్రి రాజయ్య జబ్బుచేసి చనిపోయాడు. దాంతో రాజమ్మ కష్టపడి కొడుకును పెంచింది. ఉన్నంతలో ఏ లోటూ లేకుండా చేసేది. డబ్బు దాచి ఇల్లు కట్టింది. రంగడు పెద్దవాడయ్యాక మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేసింది. కొన్నాళ్లకు ఇద్దరు పిల్లలు పుట్టారు. పెద్దతనం అయినా కూడా వారి కోసమని రాజమ్మ పనికి వెళ్లేది. కొన్నేళ్లకు రాజమ్మ బాగా వృద్ధురాలు అయ్యింది. పనికి వెళ్లలేని స్థితికి చేరింది. మంచంలోనే పడుకుంటూ కోడలు పెట్టింది తింటూ ఉండసాగింది.

కొన్నాళ్లకు రంగడులో మార్పు రాసాగింది. పిల్లల్ని, భార్యను చూసినట్లుగా తల్లిని పలకరించేవాడు కాదు. పని చేయని తల్లికి తిండి పెట్టడం దండగ అనుకోసాగాడు. ఒక రోజు ఆమెను ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని చెప్పాడు. ఆ మాటలు విన్న ఓ వ్యక్తి, ఊరి పంచాయతి సభ్యులకు తెలిపాడు. వారంతా రంగడును ఊరి అరుగు దగ్గరకు పిలిపించారు. పెంచి, పెద్ద చేసిన తల్లిని చూడని వాడిని– ఊరిలో పిల్లలూ చూసి అలాగే మారిపోతారని అనుకున్నారు. రంగడుకు ఇరవై కొరడా దెబ్బలు కొట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజమ్మ అరుగు దగ్గరకు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చింది. తన కొడుకును శిక్షించవొద్దు అని గ్రామాధికారిని ప్రాధేయపడింది. రాజమ్మ మనసు అర్థం చేసుకున్న రంగడు తాను చేసిన తప్పును తెలుసుకున్నాడు. కన్నతల్లిని గుండెలకు హత్తుకుని తాను అన్న మాటలకు క్షమించమని కోరాడు. దాంతో గ్రామాధికారి శిక్ష రద్దు చేశాడు.



-ఎం మేఘున,
6వ తరగతి,
జిల్లా పరిషత్ హై స్కూలు,
తాడేపల్లి.



- కె. దేవరాజ్ కుమార్,
9వ తరగతి,
విజయ హైస్కూలు,
యనమలకుదురు,
కృష్ణాజిల్లా.

అమన్ వండర్‌లా వినోద పార్కు




హాయ్ ఫ్రెండ్స్! నేను వేసవి సెలవుల్లో హైదరాబాదులోని మా ఆంటీ వాళ్ల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాను. ఓ ఆదివారం అందరం కలిసి అమర్ వండర్‌లా వినోద పార్కుకు వెళ్లాం. నాకు చాలా బాగా నచ్చింది. ఈ పార్కును 2016లో రంగారెడ్డి జిల్లా మహేశ్వర మండలంలోని రావిరాల గ్రామంలో 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారట. ఒకే రోజు పది వేల మంది దీనిని వీక్షించవచ్చు. ఈ ప్రదేశం మొత్తం సరదాగా తిరిగాం. చాలా ఆనందించాను. అక్కడ ల్యాండ్ గేములు, వాటర్ గేములు ఆడాం. నాకు అయితే మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తోంది. అసలు బయటకు రావాలనిపించలేదు. ఆకర్షణీయంగా బొమ్మలు, చెట్లు, పార్కులు ఉన్నాయి. కొలను వద్ద వెవ్స్ చూసేవారికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.. వేసవి సెలవులు వచ్చినప్పుడల్లా నేను వండర్‌లా వినోద పార్కుకు రావాలనుకుంటున్నా.





- షేక్ అమన్,
1వ తరగతి,
లక్ష్మీపురం,
గుంటూరు.

బొమ్మరిల్లు







- జి. జ్యోత్స్న,
2వ తరగతి,
రమ స్కూలు, విజినగిరి,
జామి మండలం,
విజయనగరం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

మీ కోసం

టూత్‌బ్రష్‌ల్లో పేరుకుపోయిన పేస్ట్ మరకలు పోవాలంటే ఓ గ్లాసులో చిటికెటు వంటసోడా, రెండు చుక్కల నిమ్మరసం, బ్రష్ మునిగేంతవరకు వేడినీరు పోసి బ్రష్‌లను అందులో పావుగంట నానబెట్టాలి. ఆ తరువాత బయటికి తీసి మంచినీటితో శుభ్రంచేసుకోవాలి.




జీవన సౌరభం

భయాన్ని పంచేది, పెంచేది ఏదైనా హానికరమే..

JEEVANA జీవన the family

గృహహింస బాధితుల్లో అనారోగ్య తీవ్రత

సుభద్రకు చిన్నప్పటి నుంచి ఆస్తమా సమస్య ఉంది. పెళ్లయి పిల్లలున్నా ఇప్పటికీ ఆ సమస్య వేధిస్తోంది. బాల్యంలో కంటే ఇప్పుడు ఇంకా ఇబ్బంది పడుతోంది. దీంతో తరచూ హాస్పటళ్ల చుట్టూ తిరగాల్సివస్తోంది. జానకికి బాల్యంలో ఆస్తమా లేకపోయినా పెళ్లయిన తరువాత నుండి వ్యాధితో బాధపడుతోంది. దీనికి తోడు చర్మసంబంధిత అలెర్జీలు ఆమెను పట్టిపీడిస్తున్నాయి. ఈ ఇద్దరు మహిళల్లో ఈ సమస్య పైకి చాలా సాధారణంగా కనబడుతోంది. పైగా పనుల ఒత్తిడిల్లో నిత్యం సతమతమయ్యే మహిళలు రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధపడడం చాలా మామూలు విషయంగా పరిగణిస్తాం. కానీ ఈ అనారోగ్యం వెనుక ఆమె పడుతున్న గృహహింస కూడా ఒక కారణమని పరిశోధనల్లో తేలింది. ప్రపంచంలో అనేక మంది మహిళలు ఎదుర్కొనే గృహహింస ఆమెను మానసికంగా, శారీరకంగా ఇబ్బందుల పాల్జేస్తున్నదని ఒక పరిశోధనలో తేలింది.



గృహహింసకు గురైన మహిళల్లో ఆస్తమాతో పాటు అటోపిక్ వ్యాధులు (చర్మ సంబంధిత అలెర్జీలు, ప్రకృతి సంబంధ కారణం లేకుండా సంక్రమించే వ్యాధులు) ఎక్కువగా ప్రబలుతున్నట్లు లండన్‌కు చెందిన 'జర్నల్ ఆఫ్ అలెర్గి అండ్ క్లినికల్ ఇమ్యునాలజీ'లో ప్రచురితమైంది. మహిళల్లో వ్యాధి తీవ్రతలపై నివేదికను తయారుచేసిన డాక్టర్ల బృందం వారు తరచూ ఎదుర్కొంటున్న గృహహింసపై కూడా పరిశోధనలు చేసింది. గృహహింసకు గురికాని మహిళల వ్యాధి తీవ్రత కంటే గృహహింసకు గురవుతున్న మహిళల్లో తీవ్రత ఎక్కువగా ఉందని నివేదికలో తేలింది.

'గృహహింసకు గురౌతున్నట్లు చెప్పిన మహిళల్లో 52 శాతం మందికి 'అటోపిక్ వ్యాధులు' తీవ్రంగా ప్రబలినట్లు' లండన్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హమ్'కు చెందిన వైద్యులు డాక్టర్ జోహట్ సింగ్ చందన్ తెలిపారు. 'ప్రపంచవ్యాప్తగా గృహహింసకు గురవుతున్న మహిళల సంఖ్య ఎక్కువగానే ఉంది. మా నివేదిక దాన్ని ఆధారం చేసుకొనే తయారుచేశాం. మా బృందం మొదట బాధిత మహిళల ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసేందుకు, ప్రజారోగ్య విధానాల ప్రభావం వంటి వాటిపై చేయాలనుకున్నాం. అయితే పరిశీలనా క్రమంలో గృహహింస బాధితులను ప్రత్యేకంగా అంచనా వేశామ'ని సింగ్ అంటున్నారు.

'మా డాక్టర్ల బృందం గృహహింసకు గురైనట్లు బహిర్గతమైన 18 ఏళ్ల పైబడిన మహిళల ఆరోగ్య సమస్యలను, గృహహింసకు గురికానటువంటి మహిళల ఆరోగ్య సమస్యలతో సరి పోల్చింది. బాధితులమని పేర్కొన్న 13, 852 మంది మహిళలను బాధితులు కాని 49, 036 మహిళలతో అంచనా వేసినప్పుడు బాధితుల్లో 967 మంది(7 శాతం), బాధితులు కానివారిలో 2,607(5.3 శాతం) మందిలో ఆస్తమా సమస్యతో పాటు అటోపిక్ వ్యాధులు ప్రబలినట్లు గుర్తించారు. పైగా బాధితుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు పరిశీలనలో తేలిందని' సింగ్ చెబుతున్నారు.






సగ్గుబియ్యంతో సత్వర బలం

ఈ ఎండల వేళ.. చెమటలు, ఉక్కబోతతో శరీరం బాగా నీరసించి పోతుంది. ఆకలి అయినా ఎక్కువగా తినాలని అనిపించదు. నీరసం తగ్గి, వెంటనే శక్తి పొందాలంటే సగ్గుబియ్యం జావ మంచి ఆహారం. శరీరంలో అధిక వేడిని తగ్గించి, బలం ఇచ్చే పదార్థాల్లో సగ్గుబియ్యం ముందు వరసలో ఉంటుందని వైద్యులు అంటున్నారు. ఇంకా సగ్గుబియ్యం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలున్నాయో తెలుసుకుందాం.

- శరీరంలోఎలక్ట్రోలైట్ సమతుల్యతను క్రమబద్ధీకరిస్తుంది. దాంతో నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడి, నీరసం తగ్గుతుంది.
- సగ్గుబియ్యంలో అధిక పొటాషియం– పొటాషియం వాసోడైలేటర్‌గా పనిచేస్తుంది. ఇది రక్త నాళాలలో ఉద్రిక్తతను తగ్గించి, రక్తప్రసరణ సాఫీగా జరిగేలా చేస్తుంది. దాంతో రక్తపోటు తగ్గి హృదయనాళ వ్యవస్థ ఒత్తిడిని తగ్గిస్తుంది.
- ఇందులో ఫైబర్ ఉండి జీర్ణక్రియను సాధారణ స్థితిలో ఉంచుతుంది. శరీర దృఢత్వానికి దోహదం చేస్తుంది. ఎముక సాంద్రతను పెంచుతుంది.
- సగ్గుబియ్యంలో రాగి, ఇనుము, కాల్షియం ఉండి ఎముక కణజాలాన్నీ వృద్ధి చేస్తాయి. దాంతో ఎముకల వ్యాధులు తగ్గుతాయి.
- వీటిలోని కార్బోహైడ్రేట్స్ అధిక శక్తిని అందించి, కండరాల పునరుద్ధరణ వేగాన్ని పెంచడంలో సహాయపడే సమ్మేళనాలను కలిగి ఉంటుంది. దాంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- ఎర్ర రక్త కణాల సంఖ్యను మెరుగుపరచడం, శరీరంలోని లోపలిభాగాలకు రక్త ప్రసరణ సమర్థవంతంగా అందేలా చేస్తుంది.



పవన్ కళ్యాణ్ 'బ్రో'

నటుడు పవన్ కళ్యాణ్, మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నారని అందరికీ తెలిసిన విషయమే. కోలీవుడ్ డైరెక్టర్ సముద్రఖని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. కోలీవుడ్ చిత్రం 'వినోదయా సీతాం' రీమేక్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా 'బ్రో' టైటిల్‌గా ఖరారు చేస్తూ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. దీంతో పాటు ఓ వీడియోనూ విడుదల చేశారు. పవన్ దేవుడు, టైమ్‌గా కనిపిస్తుండగా.. తేజ్.. కుర్ర డాక్టర్‌గా కనిపిస్తున్నాడు. పాటకు థమన్ కాల: గమన సంకాశం అనే శ్లోకంతో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. ఈ సినిమా జులై 28 న ప్రేక్షకుల ముందుకు రానుంది.

రజనీ చివరి చిత్రం ఇదే..



లోకేశ్ కనగరాజ్‌తో రజనీకాంత్ 171వ చిత్రం తెరకెక్కించబోతున్నారని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ విషయంపై డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ మిస్కిన్ క్లారిటీ ఇచ్చారు. లోకేశ్ కనగరాజ్ నెక్స్ట్ సినిమా రజనీకాంత్‌తో ఉండబోతుందని అప్‌డేట్ ఇచ్చారు. ఇదే రజనీకాంత్ చివరి సినిమా కూడా కావొచ్చని చెప్పారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఏ జోనర్‌లో ఉండబోతుంది. రజనీకాంత్‌ను ఎలా చూపించడబోతున్నారనేది మాత్రం రివీల్ చేయలేదు. లోకేశ్ ప్రస్తుతం విజయ్‌తో లియో షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.

'షెకావత్' ప్రతీకారంతో వస్తాడు..



అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్‌గా సుకుమార్ తెరకెక్కిస్తున్న 'పుష్ప 2' చిత్రీకరణ శరవేగంగా జరుపుకుంటోంది. తాజా సమాచారం ప్రకారం పుష్పరాజ్‌ను ఎదుర్కొనే పోలీసు ఆఫీసర్ పాత్ర భన్వర్ సింగ్ షెకావత్‌పై కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తిచేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు షూటింగ్ లొకేషన్‌లో డైరెక్టర్ సుకుమార్, ఫహాద్ మానిటర్ స్క్రీన్‌ను చూస్తున్న ఫొటోను ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'ఈ సారి ఆయన ప్రతీకారంతో తిరిగి వస్తాడు' అనే ట్యాగ్‌లైన్‌ను కూడా జత చేశారు. షెకావత్ పాత్రలో మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

10 రోజుల్లో రూ. 100 కోట్లు రాబట్టిన సినిమా తెలుగులో..



మే 5న మలయాళంలో విడుదలైన '2018' చిత్రం రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి 10 రోజుల్లోనే రూ.100 కోట్లు రాబట్టింది. ఇంత ఘనవిజయం సాధించిన సినిమాని ఇప్పుడు తెలుగు, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం ఓ ప్రకటన విడుదల చేసింది. గురువారం ఇందుకు సంబంధించిన ట్రైలర్‌ను కూడా విడుదల చేసింది. జూడే ఆంథోని జోసెఫ్ దర్శకత్వంలో టోవినో థామస్, కుంచకో బోబన్, అసిఫ్ అలీ, లాల్ తన్వి రామ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో వాస్తవదృశ్యాలు చూపించారు. 2018లో కేరళ రాష్ట్రాన్ని వరదలు అతలాకుతలం చేసిన సంగతి తెలిసిందే. వందల మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. నాటి ఘోర విపత్తు ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. తమని తాము రక్షించుకుంటూనే ఎదుటివారికి ఎలా సాయం చేశారు? అనే కథాంశాన్ని తీసుకుని భావోద్వేగ భరితంగా ఈ చిత్రాన్ని దర్శకుడు ఆంథోని తెరకెక్కించారు.

జర్నలిస్టు పాత్రలో నాగచైతన్య



హీరో నాగచైతన్య నటించిన తొలి వెబ్ సిరీస్ 'దూత'. గతేడాదిలో ప్రకటించిన ఈ సిరీస్ గురించి ఆయన ఆసక్తికర విషయాలు తెలిపారు. సిరీస్ షూటింగ్ అంతా పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఓటీటీ సంస్థ అమెజాన్‌లో దీన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. దేశవ్యాప్తంగా ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేయాలనుకుంటోంది. హారర్ కథతో రూపొందిస్తున్న ఇందులో నేను జర్నలిస్ట్ పాత్రలో కనిపిస్తాను." అని తెలిపారు. విక్రమ్.కె కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ సిరీస్‌ను నాగచైతన్య 'థాంక్యూ' చేస్తున్నప్పుడే ప్రకటించారు. ఈ సిరీస్ జులైలో విడుదలవనుంది.



100

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్ కోహ్లి

అదరగొట్టిన బెంగళూరు

- ప్లే-ఆఫ్ ఆశలు సజీవం
- కోహ్లి శతకం, డుప్లెసిస్ అర్ధ శతకం

హైదరాబాద్: ప్లే-ఆఫ్ చేరాలంటే కీలకమైన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెచ్చిపోయింది. గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్లతో ఘన విజయం సాధించింది. 187 పరుగుల లక్ష్యాన్ని కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 19.2 ఓవర్లలోనే అధిగమించింది. కోహ్లి 100 పరుగులు (63 బంతుల్లో 4 సిక్స్‌లు, 12 ఫోర్లు) చేయగా, డుప్లెసిస్ 71 పరుగులు (47 బంతుల్లో 2 సిక్స్‌లు, 7 ఫోర్లు) చేశారు. తరువాత మ్యాక్‌వెల్ (5), బ్రాస్‌వెల్ (4) అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విజయంతో బెంగళూరు ప్లేఆఫ్ ఆశలు సజీవంగా ఉన్నాయి. గురువారం మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 186 పరుగులు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఐపిఎల్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. కేవలం 51 బంతుల్లో 8ఫోర్లు, 6సిక్సర్ల సాయంతో 104పరుగులు చేసి ఔటయ్యాడు. త్రిపాఠి(15) ఔటయ్యాక క్రీజ్‌లోకి వచ్చిన క్లాసెన్ బౌలర్ ఎవరైనా సరే లెక్క చేయకుండా బెంగళూరు బౌలర్లను ఉతికారేశాడు. హ్యారీ బ్రూక్(27నాటౌట్; 19బంతుల్లో 2ఫోర్లు, సిక్సర్) వేగంగా ఆడాడు. అంతకుముందు, ఓపెనర్లు అభిషేక్ శర్మ(11), రాహుల్ త్రిపాఠి(15) తక్కువ స్కోరుకే అవుటయ్యారు. కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్ 20 బంతుల్లో 18 పరుగులు చేసి షాబాజ్ అహ్మద్ బౌలింగ్ లో బౌల్డయ్యాడు. ఆఖరి ఓవర్లో సిరాజ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడమే కాకుండా, ఇన్నింగ్స్ చివరి బంతికి గ్లెన్ ఫిలిప్స్(5)ను అవుట్ చేశాడు. బెంగళూరు బౌలర్లలో మైకేల్ బ్రాస్‌వెల్‌కు రెండు, సిరాజ్, షాబాజ్ అహ్మద్, హర్షల్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

రికర్వు విభాగంలో నిరాశే..!

ఆర్చరీ ప్రపంచకప్

అంటల్యా(టర్కీ): ఆర్చరీ ప్రపంచకప్ పురుషుల రికర్వు విభాగంలో భారతజట్టు పోరాటం ముగిసింది. ధీరజ్ బొమ్మదేవర, అతాను దాస్, నీరజ్ చౌహాన్‌లతో కూడిన భారతజట్టు గ్రూప్–1 క్వార్టర్‌ఫైనల్లో 0–6(54–55, 56–57, 54–59)తేడాతో టాప్ సీడ్ కొరియా చేతిలో చిత్తుగా ఓడింది. 8వ సీడ్‌గా బరిలోకి దిగిన భారత రికర్వు జట్టు తొలి మ్యాచ్‌లో 5–3(57–57, 56–58, 57–56, 58–51)తేడాతో చైనీస్ తైపీపై గెలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. ఇక 4వ సీడ్‌గా బరిలోకి దిగిన మహిళల తొలిరౌండ్‌లోని పరాజయాన్ని చవిచూసింది. సిమ్రన్‌జీత్ కౌర్, అన్వీత్ కౌర్, అంకిత భగత్‌లతో కూడిన మహిళల జట్టు క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇండోనేషియా చేతిలో 1–5(54–57, 57–57, 50–52)తో పోరాడి ఓడింది. రికర్వులో భారత్ పోరాటం ముగియడంతో మిక్స్‌డ్ డబుల్స్‌లో ధీరజ్ బొమ్మదేవర–సిమ్రన్‌జీత్ కౌర్ బరిలో ఉండగా.. 5వ స్థానంలో నిలిచి వీరు ప్రి క్వార్టర్స్‌లో డ్రా చేసుకొన్నారు.

హాకీలో అమ్మాయిల ఓటమి

ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్



ఆడిలైడ్: ఆస్ట్రేలియా అమ్మాయిలతో జరుగుతున్న మూడు టెస్ట్ మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. ఆడిలైడ్‌లోని మటే స్టేడియంలో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో 2–4గోల్స్ తేడాతో ఓడింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల సన్నద్ధతలో భాగంగా భారత మహిళల హాకీ జట్టు ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఆడుతోంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 8వ ర్యాంక్‌లో ఉన్న భారత్.. రెండో క్వార్టర్‌లో వరుసగా రెండు గోల్స్ సమర్పించుకొంది. గోల్ కీపర్ సవిత పూనియా సారథ్యంలో ఇక్కడకు చేరిన జట్టు మూడో క్వార్టర్ ముగిసే సరికి 1–4తో వెనుకబడింది. ఈ సిరీస్ ముగిసిన అనంతరం ఆస్ట్రేలియా–ఏతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో ఆడనుంది.

మహిళల ఫుట్‌బాల్ జట్టుకు సంక్లిష్టం

ఎఎఫ్‌సి మహిళల ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ రౌండ్–2



న్యూఢిల్లీ: ఎఎఫ్‌సి మహిళల ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ రౌండ్–2లో భారత్‌కు గట్టి పరీక్ష ఎదురుకానుంది. భారతజట్టు ఉన్న గ్రూప్‌లో జపాన్, వియత్నాం, ఆతిథ్య ఉజ్బెకిస్తాన్ జట్లు ఉన్నాయి. ఈ టోర్నీ అక్టోబర్ 23నుంచి నవంబర్ 1 వరకు జరగనుంది. భారత్ ఈ ఏడాది జరిగిన రౌండ్–2లో కిర్గిజ్ రిపబ్లిక్‌పై 5–0 మరియు 4–0గోల్స్ తేడాతో గెలిచి ప్లే–ఆఫ్‌కు చేరింది. గ్రూప్–సిలో ఉన్న భారత జట్టు 61వ ర్యాంక్‌తో బరిలోకి దిగుతోంది. ఇక జపాన్ జట్టు 2012 ఒలింపిక్స్‌లో రజిత పతకం సాధించగా.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ 11వ స్థానంలో ఉంది. ఇక వియత్నాం జట్టు గత ఏడాది జరిగిన ఫిఫా ప్రపంచకప్‌లో అరంగేట్రం చేసి ప్రస్తుతం 33వ ర్యాంక్‌లో ఉంది. ఇటీవల కిర్గిజ్ రిపబ్లిక్‌తో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్ జట్టు 2–3గోల్స్ తేడాతో ఇంజూరీ సమయంలో గెలిచింది. ఇక భారత్ 2019లో జపాన్‌తో మ్యాచ్‌ను 1–1తో డ్రా చేసుకొని 1997 ఆసియా మహిళల ఛాంపియన్‌షిప్ పోటీల్లో 0–1తో ఓటమిపాలైంది. ఈ టోర్నీలో విజేతగా, రన్నరప్‌గా నిలిచిన జట్లు 2024 ఒలింపిక్స్‌కు ఆసియా ఖండంనుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి.

ఐపిఎల్‌లో నేడు..

పంజాబ్ × రాజస్తాన్
(వేదిక: ధర్మశాల; రా.7.30గం॥లకు)

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	+0.83
చెన్నై	13	7	5	1	15	+0.38
లక్నో	13	7	5	1	15	+0.30
బెంగళూరు	13	7	6	0	14	+0.180
ముంబయి	13	7	6	0	14	-0.12
రాజస్తాన్	13	6	7	0	12	+0.14
కోల్‌కతా	13	6	7	0	12	-0.25
పంజాబ్	13	6	7	0	12	-0.30
ఢిల్లీ	13	5	8	0	10	-0.57
హైదరాబాద్	13	4	9	0	8	-0.558

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68